నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
గురువారం 15 ఆగస్టు 2024 పేజీలు 8


## ఫేక్ ప్రచారం.. పదేపదే అబద్ధాలు



ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వైసిపి ఎందుకు కలిసినట్టు?

చెప్పిన అబద్ధాలే పదేపదే చెప్పడానికి సిగ్గనిపించడం లేదా

జగన్ పేరు తొలగిస్తే విగ్రహంపై దాడి జరిగినట్లు ప్రచారం

ఢిల్లీ స్థాయిలో మరోసారి పరువు దిగజార్చుకున్న వైసిపి

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

సూర్యప్రతినిధి, ఒంగోలు

వైసిపి నేతలు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ని ఎందుకు కలిశారు? చెప్పిన అబద్ధాలే పదేపదే చెప్పడానికి సిగ్గనిపించడం లేదా? అంబేద్కర్ విగ్రహం దగ్గర అంబేద్కర్ పేరు కంటే జగన్ పేరు పెద్దగా ఉండడంతో అంబేద్కర్ వాదులు దాన్ని జీర్ణించుకోలేక జగన్ పేరు తొలగించారు. అంబేద్కర్ విగ్రహంపై చిన్న గీత కూడా పడలేదు. కానీ వైసీపీ నేతలు మాత్రం అంబేద్కర్ విగ్రహంపై దాడి జరిగినట్టుగా ఫేక్ ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ఫేక్ ప్రచారంతో ఢిల్లీ స్థాయిలో మరోసారి పరువు దిగజార్చుకున్నారు. విదేశీ మిగతా 3లో

## ఒంగోలు వైసిపికి బిగ్ షాక్



ఒంగోలు కార్పొరేషన్ టిడిపి కైవసం

సైకిల్ ఎక్కిన మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ బుజ్జి

క్యూకట్టిన వైసిపి కార్పొరేటర్లు, త్వరలో మరికొంత మంది

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో టిడిపి తీర్థం

కలిసికట్టుగా నగర అభివృద్ధికి పాటుపడతాం: మేయర్

సమిష్టిగా ఒంగోలును అభివృద్ధి చేద్దాం: ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పిలుపు

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు వైసిపికి బిగ్ షాక్ తగిలింది. ఒంగోలు కార్పొరేషన్‌ను టిడిపి కైవసం చేసుకుంది. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల సమక్షంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జితో పాటు కొంతమంది వైసిపి కార్పొరేటర్లు టిడిపిలోకి చేరారు. బుధవారం ఎమ్మెల్యే జనార్ధన్ స్వగ్రామమైన తూర్పు నాయుడు పాలెంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కార్పొరేటర్లుతో ముందుగా సమావేశం అయ్యారు. టిడిపి కార్పొరేటర్లు, వైసిపిని వీడి టిడిపిలోకి వచ్చిన కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించిన జనార్ధన్ అందరూ కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. తరువాత మేయర్, డిప్యూటీ మేయర్, పలువురు కార్పొరేటర్లను పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి కార్పొరేటర్లు ఆరు మంది, జనసేన కార్పొరేటర్ ఒకరితో కలిపి ప్రస్తుతం ఒంగోలు కార్పొరేషన్‌లో టిడిపి కూటమి కార్పొరేటర్ల బలం 23కి చేరింది. త్వరలోనే ఇంకా టిడిపిలోకి వచ్చేందుకు వైసిపి కార్పొరేట్లు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. వైసిపికి అడ్డాగా ఉన్న కార్పొరేషన్‌ను టిడిపి కైవసం చేసుకుంది.

### సమిష్టిగా ఒంగోలును అభివృద్ధి చేద్దాం: ఎమ్మెల్యే దామచర్ల

అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మీడియాతో మిగతా 3లో





## యువతలో దేశభక్తి పెరగాలి

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం

ఒంగోలులో 700 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన

ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల, జిల్లా కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంగోలు నగరంలోని చర్చి సెంటర్ నందు పేస్ ఇంజనీరింగ్ కళాశాల వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 700 మీటర్ల జాతీయ జెండా ర్యాలీని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి మిగతా 3లో







## పింగళి ది ఘనకీర్తి



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: ఉద్యమాలకు ఊపిరిగా, సమరయోధులకు ఆయుధంగా నిలిచింది మన జాతీయ జెండా. అది మన అస్తిత్వానికి చిహ్నం. మన పౌరుషానికి ప్రతీక. నేడు ఇంటింటా, దేశవ్యాప్తంగా ఎగురుతున్న మువ్వన్నెల జెండాకు తెలుగువాడు రూపకల్పన చేయడం మనకు ఎంతో గర్వకారణం. తెలుగువారి గౌరవాన్ని సమున్నతంగా నిలబెట్టారు పింగళి వెంకయ్య. దేశవిదేశాలలో తెలుగువారి ప్రతిష్టను ఇనుమడింప చేశారు ఆయన. తర తరాలకు తరగని పేరు ప్రఖ్యాతులును ఆర్జించి పెట్టారు. దేశమనుగడకు మూలమైన త్రివర్ణ పతాకాన్ని అందించారు.అటువంటి పింగళి వెంకయ్యకు బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. రైల్వే స్టేషన్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి విద్యార్థులందరూ జేజేలు పలికారు.పింగళి అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కజోడ్ మాల్ మీనా, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు ఏవీ ఉన్నత పాఠశాల హ చ్ ఎం యడ్ల సత్యవతి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, దుర్గ, సుకన్య విద్యార్థులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: ప్రభుత్వం నిర్దేశించిన లేఅవుట్లలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని మండల ప్రత్యేక అధికారి,జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం హనుమంతరావు సూచించారు.మండల ప్రజా పరిషత్ సమావేశాలలో గత మూడు రోజులుగా మండల పరిధిలోని కార్యదర్శులు, సర్పంచుల శిక్షణా కార్యక్రమాలు బుధవారం నాటితో ముగిశాయి.ఈ సందర్భంగా జరిగిన సభకు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక అధికారి హనుమంతరావు మాట్లాడుతూ బాపట్ల జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు వందరోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం గృహ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. సచి వాలయం వారీగా ప్రతి వారానికి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని అందరూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితా కుమారి,జెడ్పిటిసి తిరువీదుల ఉదయ భాస్కరి, ఈవోపీ ఆర్డి టి.ఊహరాణి,ఏఈ హౌసింగ్ రావూరి సౌమ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ,పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీ రింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## భట్టిప్రోలు ఎంపీడీవో గా చంద్రశేఖర్



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు మండల ప్రజాపరిషత్ అభి వృద్ధి అధికారిగా గుమ్మా చంద్రశేఖర్ బుధవారం బాధ్య తలు చేపట్టారు. సాధారణ ఎన్నికలకు ముందు బదిలీపై వెళ్లిన ఎంపీడీవో లను తిరిగి అదే మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు గతంలో ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్ బుధవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు.ఈయన ఎన్నికల సమయంలో కృష్ణా జిల్లా మొవ్వ మండలంలో ఎంపీడీవో గా పనిచేశారు.ఎన్నికల సమయంలో ఇక్కడకు బదిలీపై ఎంపీడీవో గా ప్రకాశం జిల్లా నుండి వచ్చిన జేబీవీ మల్లికా ర్జునరావు జూలై 31న భట్టిప్రోలు లోనే ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుండి భట్టిప్రోలు ఇన్చార్జి ఎంపీడీవో గా పనిచేస్తున్న టి ఊహారాణి నుండి చంద్రశేఖర్ బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు,నూతన కార్యద ర్శులు ఎం పీడీవో చంద్రశేఖర్ ను కలసి,సత్కరించి, అభినందనలు తెలిపారు.

# కమిషన్ రహిత పురపాలక కమిషనర్ నిర్మల్ కుమార్: తాండ్ర



బాపట్ల, మేజర్‌న్యూస్: పట్టణ పురపాలక సంఘం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ ను బాపట్ల లోని మాజీ సైనికులతో కలిసి మర్యాదాపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేసిన బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపిటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు. భేటీ అనంతరం ఎంపిటీసీ తాండ్ర మాట్లాడుతూ, ఒక వైపు అవినీతి రహిత బాపట్ల గా తయారు చేయుటకు కంకణం కట్టుకొని పని చేస్తున్న స్థానిక శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు కి తోడుగా ఉద్యోగ బాధ్యతల పట్ల నిబద్ధత కలిగిన ఒక మంచి అధికారి బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా రావటం బాపట్ల ప్రజల అదృష్టం అని కొనియాడారు. కమిషన ర్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులలో నే బాపట్ల మున్సిపాలిటీ లో ఉన్న సమస్యల పై పట్టు సాధించి, సమస్యల పరిష్కారాలకు కూడా నూతన కమిషనర్ అవలంభిస్తున్న తీరు అభినందనీయం అని ఎంపిటీసీ తాండ్ర సాంబశివరావు కొనియాడారు. మున్సిపాలిటీ లో ఉన్న మాజీ సైనికులకు సంబందించిన హౌస్ టాక్స్ ఎగ్జెంప్షన్ సంబంధిత సమస్యల గురించి తెలిపిన వెంటనే సానుకూలంగా స్పందించిన కమిషనర్ నిర్మల్ కుమార్ కు మాజీ సైనికులతో కలిసి అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ధన్యవాదాలు తెలియ జేశారు. ఏవైనా విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు గాని లేక మున్సిపాలిటీ అభివృద్ధి లో గాని మాజీ సైనికులు అవసరం ఉంటే, ప్రభుత్వానికి కానీ మున్సిపాలిటీ కి గాని సహకరించటా నికి వెనుకంజ వేయబోము అని మాజీ సైనికుల తో కలిసి అధ్యక్షులు తాండ్ర భరోసా ఇచ్చారు. దేశ సేవ చేసిన మాజీ సైనికుల పట్ల కమీషనర్ చూపించిన ఆప్యాయత కు మాజీ సైనికులు ముగ్దులు అయ్యారు అని అధ్యక్షులు తాండ్ర తెలియ జేశారు. కార్యక్రమంలో అసోసియే షన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆది శేషరెడ్డి, ఉమ్మడి గుం టూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరిరావు, సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గా రావు, అబ్దుల్ రజాక్, కె రాజేష్ నాయుడు, పసుపు లేటి ప్రసాద్, కె ఆంజనేయు లు, బసివి రెడ్డి, రుక్మదర రావు, శ్రీనివాస రెడ్డి, డి వెంకటేశ్వర్లు, మున్నం కోటేశ్వర రెడ్డి, పీఠ సారథి మొదలగు మాజీ సైనికులు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యం దిశగా ఏ పి పంచాయతీరాజ్



వేమూరు(భట్టిప్రోలు),మేజర్‌న్యూస్: మహాత్మ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా జనసేన పార్టీ కూటమి ప్రభుత్వం గ్రామపంచాయతీ వ్యవస్థను పటిష్టం చేస్తున్నదని వేమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వూసా రాజేష్ అన్నారు.బుధవారం స్థానిక విలేకరులతో రాజేష్ మాట్లాడుతూ పంద్రాగస్టు సందర్భంగా గ్రామపంచాయతీలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు కొరకు గతంలో కంటే భిన్నంగా,నిధులను భారీగా పెంచి, ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి,పంచాయతీరాజ్ శాఖ మాత్యులు పవన్ కళ్యాణ్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బం ది కలుగకుండా ఘనంగా వేడుకలు ఏర్పాట్లు చేయాలని పవన్ కళ్యాణ్ సూచిం చారని,వేమూరు నియోజకవర్గ పరిధి లోని 5 మండలాలలోనున్న గ్రామ పంచాయతీ సర్పంచులు కార్యదర్శులు స్వతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించాలని రాజేష్ కోరారు. గ్రామ సర్పంచులు చొరవ చూపి స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాలకు సాదరంగా ఆహ్వానించి గౌరవించాలని, అదే విధంగా స్కూల్ పిల్లలను బాలబాలికలను కార్యక్రమానికి రప్పించి జాతీయ గీతా లాపన జరిపించాలని రాజేష్ కోరారు.

## నగరం కళాశాలలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహణ



నగరం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన నగరం శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో 78వ స్వతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి నేతృత్వంలో అజాధిక అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ఘర్ తిరంగా కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్లు సంయుక్తంగా నిర్వహించారు. కళాశాలలోని అన్ని విభాగాలపై జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పురవీధుల్లో సైకిల్ ర్యాలీ, జండా ప్రదర్శన గావించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, వైస్ ప్రిన్సిపల్ పి. వెంకటనారాయణ, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఏ. శ్రీనివాసరావు, ఆయా శాఖాధిపతులు డాక్టర్ వి. శ్రీనివాసరావు, వి. విష్ణువర్ధనరావు, ప్రసన్నబాబు, కార్యాలయ సూపరింటెండెంట్ పి. అమరేష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంవి శివయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ యు. సాంబమూర్తి, శివప్రసాద్, మస్తాన్, గోపికృష్ణ, నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సై తిరుపతిరావుకు శుభాకాంక్షలు తెలిపిన బొమ్మిడి



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: కోస్టల్ మెరైన్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు మరియు టిడిపి సీనియర్ నాయకుడు బొమ్మిడి రామకృష్ణ నిజాంపట్నం నూతన ఎస్సై కందుల తిరుపతిరావును బుధవారం స్టేషన్లో మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఫవర్ బొకే దుశ్యాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ యువత మహిళల పట్ల అసభ్య కరంగా ప్రవర్తించకుండా చూడాలన్నారు. గ్రామంలో శాంతి భద్రతలు మరియు రాత్రి వేళల్లో సిబ్బంది తో గస్తీ నిర్వహిం చాలని ఎస్సైని రామకృష్ణ కోరారు. ముఖ్యంగా నిజాంప ట్నంలోనే ప్రధాన పాఠశాలల సమయాలలో విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల కు వెళ్లేటప్పుడు మరియు బయటకు వస్తున్న సమయంలో పోలీసులను విధులు నిర్వహించాలని ఆయన కోరారు. ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో టిడిపి కార్య కర్తలు ఖాదర్ బాబు, ఇమ్రాన్ ఖాన్, రమేష్, బిక్షాలు ఉన్నారు.

## జాతీయ వాదం బలపడుతుంది: డాక్టర్ డి డి స్మిత్




బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: హర్ ఘర్ తరంగ్ ర్యాలీ డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బంది బాపట్ల కొత్త బస్టాండ్ దగ్గర నుంచి డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల వరకు మువ్వెన్నెల జెండాలతో ర్యాలీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్ మాట్లాడుతూ దేశ సమైక్యతను సగర్వంగా చాటి చెప్పేందుకు ప్రతి పౌరుడు తన ఇంటిపై మువ్వెనల జాతీయ జెండాను ఎగురవేయాలని అన్నారు. ఇంటర్నేషనల్ ఎన్ఎస్ఎస్ యూనిట్ డే సందర్భంగా హర్ ఘర్ తరంగ్ సందర్భంగా ప్రతి ఇంటిపై రెపరెపలాడే భారతదేశ మువ్వేనల జెండాని ఎగరవేయాలని అన్నారు. దీని ద్వారా మన దేశ సమైక్యతను జాతీయవాద భావాన్ని తెలియజేయాలనే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రధాని మోడీ పిలుపుమేరకు పర్యావరణ హితంగా చేసిన జాతీయ జెండాను ఎగురవేయాలి అన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని మన భారతదేశ సమైక్యతను చాటే విధముగా అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ ఎన్ అశోక్ కుమార్, డాక్టర్ కే లావణ్య, కార్తీక్, వెంకటేశ్వర్లు పిడి, విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

## మండల తహశీల్దారుగా నాంచారయ్య



నగరం, మేజర్‌న్యూస్: స్థానిక మండల తహశీల్దారుగా జి. నాంచారయ్య బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు ఫిరంగిపురం తహశీల్దారుగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. నాంచారయ్య మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఆయా రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూమికి సంబంధించిన సమస్యలు పరిష్కారానికి అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామంలో పర్యటించి వినతిపత్రాలు తీసుకుని పరిష్కరిస్తుందన్నారు.

## రూ.20 వేలు విలువగల ఐడి కార్డులు పంపిణీ



నగరం, మేజర్‌న్యూస్: మండల పరిధి లోని పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న సుమారు 100 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన మాజీ జిల్లా సైనిక అధికారి విఆర్‌కె చారి గుర్తింపు కార్డులు అందజేశారు. బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బదరీనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు సుమారు 20 వేల రూపాయిల విలువగల కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమం పలువురిని అలరించింది. కార్యక్రమంలో సర్పంచ్ హరేరాం, పాఠశాల ఉపాధ్యాయులు సుదర్శన్, రమేష్, రాఘవయ్య, భాస్కరరావు, లక్ష్మణరావు, అనూరాధ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు వైసిపికి బిగ్ షాక్



**మొదటి పేజీ తరువాయి** మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని అన్నీ ప్రాంతాల అభివృద్దే తమ ధ్యేయమని చెప్పారు. తమమీద నమ్మంతో ప్రజలు భారీ మెజారిటితో తనను గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నగర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కార్పొరేటర్లు తమ చేతిలో ఉంటే ఎక్కువ అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చని తెలిపారు. తమ ప్రాంతాల అభివృద్ధి కోసం టిడిపిలో చేరిన కార్పొరేటర్లను అభినందిస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్లు అంతా కలిసి కట్టుగా పనిచేసి నగర అభివృద్ధికి పాటుపడాలని, అందుకు తనవంతు తోడ్పాటునిస్తానని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా, నగర ప్రజలు సంతోషంగా ఉండేలా అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో జరిగిన అక్రమాలను వెలికితీస్తామని జనార్ధన్ చెప్పారు. భూ ఆక్రమణలు, కబ్జాలకు పాల్పడిన వారిని వదలే ప్రసక్తే లేదన్నారు. ఒంగోలును గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశం పెట్టి ప్రజా సమస్యలను చర్చిస్తామని, కార్పొరేటర్లు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, మరికొన్ని నెలలు గడిచిన తరువాత నగర అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

### అభివృద్ధికి కేరాఫ్ దామచర్ల: మేయర్ గంగాడ సుజాత

అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సారథ్యంలో పని చేయడానికి తాము టిడిపిలోకి చేరినట్లు మేయర్ గంగాడ సుజాత అన్నారు. అందరిని కలుపుకొని పోయి నగరఅభివృద్ధికి పాటుపడతామన్నారు. డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి మాట్లాడుతూ గడిచిన మూడేళ్ల కాలంలో నగరంలో కొంత అభివృద్ధి మాత్రమే జరిగిందన్నారు. శాశ్వతమైన అభివృద్ధి జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన&ఆనరు. ఎమ్మెల్యే జనార్ధన్ సహకారంతో నగరంలో శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు పాటుపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నేతలు ఉన్నారు.

## యువతలో దేశభక్తి పెరగాలి



**మొదటి పేజీ తరువాయి** జిల్లా స్థాయి వరకు దేశభక్తిని చాటేలా వాడవాడలా ఈనెల 9 నుంచి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా యువతలో ముఖ్యంగా విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేలా జిల్లా వ్యాప్తంగా తిరంగా సెల్ఫి పాయింట్స్, తిరంగా సిగ్నేచర్ క్యాంపెయిన్, తిరంగా యాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ తిరంగా కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని యువతలో దేశభక్తిని పెంపొందేలా పెద్ద ఎత్తున హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ రోజు పేస్ ఇంజనీరింగ్ కళాశాల వారు 700మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీని నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటంలో సమరయోధులు ఎంతో కృషి చేశారని, ఎన్నో త్యాగాలను చేశారని గుర్తు చేశారు. ఈ ర్యాలీ చర్చి సెంటర్ నుండి రిమ్స్ హాస్పిటల్ వరకు నిర్వహించగా, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొని భారత్ మాతాకీ జై హర్ ఘర్ తిరంగా అంటూ నినదిస్తూ మువ్వెన్నల జెండా చేత బట్టి ముందుకు సాగారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషదారణ తో విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొనడం ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి, సెట్నల్ సిఈఓ లోకేశ్వరరావు, హర్ ఘర్ తిరంగా నోడల్ అధికారి రవి కుమార్, పేస్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాత్రంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి శిద్దా



ఒంగోలు, మేజర్‌న్యూస్: బ్రెటీష్ వారి పాలన నుండి విముక్తి పొందటానికి నిర్వహించిన జాతీయోద్యమంలో ఎందరో మహానుభావులు, త్యాగధనులు పోరాటాలు చేశారని, దేశ విముక్తి కోసం చేసిన పోరాటం ప్రపంచంలోనే అపూర్వమైనదిగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. దీర్ఘకాలంగా సాగిన పోరాటంలో ఎంతోమంది స్ఫూర్తి ప్రదాతలు అసువులు బాసారని.. వారి త్యాగ ఫలితమే ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వాత్రంత్రం అని చెప్పారు. స్వాత్రంత్ర్యం కోసం పోరాడిన త్యాగధనులకు నివాళులు అర్పిస్తూ గర్వంగా త్రివర్ణ పతకానికి సెల్యూట్ చేద్దామని పిలుపునిచ్చారు. స్వాత్రంత్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## దర్శి డిఎస్‌పిగా లక్ష్మి నారాయణ బాధ్యతలు



దర్శి, మేజర్‌న్యూస్: దర్శి డిఎస్‌పిగా లక్ష్మి నారాయణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎ.సి.బిలో పని చేస్తూ దర్శికి బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న అశోక్ వర్ధన్ విఆర్‌కు బదిలీ అయ్యారు. దర్శి సబ్ డివిజన్‌లో మాదక పదార్దాలు నియంత్రణ కు కృషి చేస్తానన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కల్గించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.ఎస్.పిని సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, రాజకీయ పార్టీల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఫేక్ ప్రచారం.. పదేపదే అబద్ధాలు

**మొదటి పేజీ తరువాయి** విద్యకు అంబేద్కర్ పేరు తొలగించి జగన్ తన పేరు పెట్టుకున్నప్పుడు, వైసీపీ ఎమ్మెల్సీ దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంని దారుణంగా హత్య చేసినపుడు వైసీపీ నేతలు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ని కలిసి ఉంటే దళిత జాతి హర్షించేది. వైసీపీ నీచ రాజకీయాలను దళిత సమాజం అసహ్యించుకుంటోంది. వైసిపి ఐదేళ్లపాలనలో దళితులకు జరిగిన అన్యాయం ద్రోహం గతంలో ఎన్నడూ జరగలేదు, ఎస్సీ కార్పొరేషన్ ని నిర్వీర్యం చేశారు. సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారు. దళితుల అసైన్డ్ భూములు లాక్కున్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలను నిర్వీర్యం చేశారు. చంద్రబాబు పాలనలోనే దళితుల అభివృద్ధి అని దళిత సమాజం గుర్తించే కూటమికి గొప్ప విజయం అందించారు. వైసిపి ఫేక్ ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. వైసిపి నేతలు ఇకనైనా నీచ రాజకీయాలు మానుకోవాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హితవు పలికారు.

## తాటిపర్తి సుబ్బారెడ్డికి మాగుంట, రాఘవరెడ్డి ఘన నివాళి



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు, భాగ్యనగర్ 3వ లైన్‌లో కోల్ సొసైటీ అధ్యక్షులు తాటిపర్తి సుబ్బారెడ్డి అనారోగ్యం కారణంగా మృతి చెందారు. వారి భౌతిక కాయానికి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

## పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

### ఎస్పీ ఏఆర్ దామోదర్




ఒంగోలు, మేజర్‌న్యూస్ : పోలీసు కుటుంబాలకు అన్నీ విధాలుగా అండగా ఉంటామని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ భరోసాను ఇచ్చారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందజేశారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గుంటూరు జిల్లా, తుళ్లూరు పరిధిలో బందోబస్త్ విధులు నిర్వహిస్తూ 24.05.2023న పాముకాటు వలన మరణించిన పవన్ కుమార్ కుటుంబ సభ్యులకు తోటి 2012 బ్యాచ్‌కు చెందిన పోలీసు (సివిల్, ఏఆర్, ఇతర జిల్లాల పోలీసులు) తమ వంతు సాయంగా సేకరించిన రూ. 6,97,492, 2009 బ్యాచ్‌కు చెందిన పోలీసులు తమ వంతు సాయంగా సేకరించిన రూ.1,05,000, మొత్తం రూ. 8, 02,492 నగదును అలాగే పొదిలి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూన్న 05. 02.2022న గుండె పోటుతో మరణించిన కె. శివరామకృష్ణ గౌడ్ కుటుంబ సభ్యులకు తోటి 2012 బ్యాచ్‌కు చెందిన సివిల్ పోలీసులు తమ వంతు ఆర్థిక సాయంగా సేకరించిన రూ.2,32,800 నగదును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమంకు అన్ని చర్యలు తీసుకొని వారికి అన్నీ విధాల అండగా ఉంటానని తెలిపారు.

విధి నిర్వహణలో మరణించిన తమ సహోద్యోగుల కుటుంబాలకు తోటి బ్యాచ్ పోలీసులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, 2009, 2012 బ్యాచ్ పోలీసులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులపై రైతులతో సమీక్ష



వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని దేశాయిపేట -2 రైతు సేవా కేంద్రం నందు మేలైన యాజమాన్య పద్ధతుల అనుసంధానంతో పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఐ.కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి ముందుగా వేయబోయే ఖరీఫ్ పంట విధానం గురించి ఎటువంటి విత్తనాన్ని ఎంచుకోవాలి, విత్తనానికి విత్తనశుద్ధి ఎలా చేయాలి అనే విధానాన్ని వివరిస్తూ, వరి విత్తనాన్ని సూడోమోనస్ ఫ్లోరిసిన్స్ అనే జీవన సెలింద్ర నాశనంతో శుద్ధి చేయాలని, అలాగే మొక్కల మధ్య అంతర దూరాన్ని పాటించాలని, ఇలా పంట కాలంలో మేలైన యాజమాన్య పద్ధతులు ద్వారా పండించిన పంటకు ప్రభుత్వం వారు అందించే గ్యాప్ సర్టిఫికెట్ ద్వారా రైతులకు అధిక ధరతో పాటు అధిక దిగుబడులను కూడా సాధించవచ్చునని, పంట నాణ్యత కూడా పెరుగుతుందని తెలియపరిచారు. అలాగే ప్రతివారం జరిగే పొలంబడి కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనాలని మేలైన యాజమాన్య పద్ధతుల గురించి తెలుసుకోవాలని రైతులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.కాశీ విశ్వనాథ్, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.కావ్య, ఎస్కే రూఫియా, దేశాయిపేట గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పశుగ్రాస విత్తనాల పంపిణీ



వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని అక్కయ్యపాలెం చల్లారెడ్డి పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని పసుకాపరులకు పశుగ్రాస విత్తనాలు చల్లారెడ్డిపాలెం జబ్బర్ కాలనీ పశువైద్యశాల నందు పసుకాపరుల ఫ్యామిలీకి మూడు కేజీలు ఉచితంగా రేపటి నుండి అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్నిబుధవారం చీరాల క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చేతుల మీదుగా ప్రారంభించి రైతులకు ఉచితముగా పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు శాఖ అధికారి డాక్టర్ హనుమంతరావు, సహాయక సంచాలక వైద్యాధికారి చీరాల చిట్టిబాబు, వేటపాలెం సహాయక సంచాలక వైద్యాధికారి పుష్పలత చల్లారెడ్డి, సంచాలక పశు వైద్యాధికారి కృష్ణ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ విద్యార్థులతో మండల అధికారుల ర్యాలీ



వేటపాలెం, మేజర్‌న్యూస్: పట్టణంలోని జిల్లా పరిషత్ (బాలికల) పాఠశాల నందు ఆగస్టు 15 పురస్కరించుకొని బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీఎస్ శర్మ మండల విద్యాశాఖ అధికారి జేవి సుబ్బయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.ఫణి సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేయడం జరిగింది. ఎంపీడీవో ఎన్‌విఎస్ శర్మ మాట్లాడుతూ ప్రతి ఇంట త్రివర్ణ పతాకం ఎగరవేయాలని జాతి సమగ్రతను సమైక్యతను కాపాడాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ర్యాలీ చేసి గడియార స్తంభం సెంటర్లో మానవహారంగా ఏర్పడి మహనీయుల త్యాగ ఫలాలను గుర్తుచేసుకొని వారి బాటలో నడవాలని కోరారు.

# పంద్రాగస్టు వేడుకల పూర్తి దుస్తుల పెరడ్ రిహార్సల్





బాపట్ల, మేజర్‌న్యూస్: పంద్రాగస్టు కవాతు మరింత సుందరంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లాలో పంద్రాగస్టు వేడుకల సందర్భంగా నిర్వహించబోయే పరేడ్ రిహార్సల్ ను బుధవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించారు. పరేడ్ రిహార్సల్ ను ఎస్పీ స్వయంగా వీక్షించి, పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఏ.ఆర్ డి.ఎస్.పి ఎస్.చంద్రమోహన్ పెరేడ్ కమాండర్ గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. రిహార్సల్స్ లో భాగంగా ముందుగా సిబ్బంది నుండి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకం ఎగుర వేశారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ను పరిశీలించారు. పెరేడ్ నిర్వహించే పోలీస్ సిబ్బందికి అధికారులకు పలు సూచనలు సూచించారు. జిల్లా పోలీసు శాఖలో వివిధ విభాగాలలో ప్రతిభ కనపరిచిన పోలీసు సిబ్బంది పతకాలు ఏ విధంగా అందుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు సిబ్బంది పరేడ్ రిహార్సల్ అద్భుతంగా నిర్వహిం చారన్నారు. గురువారం జరగబోవు పంద్రాగస్టు పరేడ్ లో ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో పాల్గొని, తమ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించి, మరింత సుందరంగా కవాతు నిర్వహించాలన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనడానికి విచ్చేసే అతిథులకు, ప్రజా ప్రతినిధులకు, వీక్షించడానికి విచ్చేసే ప్రజలకు, విద్యార్థులకు ఏటువంటి అసౌకర్యం తలెత్తకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరేడ్ సందర్భంగా శాంతి భద్రతలను ఉల్లంఘించే చర్యలు ఏమాత్రం జరగ కుండా కట్టుది ట్టమైన భద్రత ఏర్పాట్లు చెయ్యా లని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటుగా అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, ఏ.ఆర్.డి.ఎస్.పి ఎస్.చంద్రమోహన్, వెల్ఫేర్ ఆర్.ఐ డి.శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్.ఐ షేక్.మౌలుద్దీన్, పరేడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్ స్పైర్ అవార్డులు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీస్తాయి

### కలెక్టర్ వెంకట మురళి



బాపట్ల, మేజర్‌న్యూస్: ఇన్ స్పైర్ అవార్డులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జాతీయస్థాయి ఇన్ స్పైర్ అవార్డులకు సంబంధించిన గోడ పత్రాలను బుధవారం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ ఆవిష్కరించారు.విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అడుగులు ముందుకు వేయాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఆవిష్కరించే నూతన ప్రయోగాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. సెప్టెంబర్ 15 వ తేదీ వరకు విద్యార్థులు తమ ప్రయోగాల వివరాలను ఆన్ లైన్ లో నిక్షిప్తం చేయవచ్చన్నారు. జాతీయ స్థాయిలో ప్రయోగాలు ఎంపికైన విద్యార్థులకు రూ.10,000 నగదు బహుమతి ఉంటుందన్నారు. 2022వ సంవత్సరంలో బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం నుంచి ఒక విద్యార్థి ఎంపికై బహుమతి పొందినట్లు తెలిపారు. ఇలాంటి వినూత్నమైన ప్రయోగాలు విస్తృతంగా ముందుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జిల్లా ఇంచార్జి డీఈఓ జి వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి రవీందర్, జిల్లా సైన్స్ అధికారి ఎండి సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో దర్వాజాలు నిలుపు పూజలు



సి.యస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని శీలం వారిపల్లె సిఎస్ పురం కోవిలంపాడు కూడలి వద్ద (వ్యవసాయ కళాశాల సమీపంలో) కనిగిరి మాజీశాస నసభ్యులు కదిరి బాబు రావు స్వంతఖర్చుతో నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం దర్వాజాలు నిలుపు పూజల్లో బుధ వారం మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు శ్రీమతి రాణి దంపతులు కుమారుడు భువ నేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలో శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామికి అర్చ కుల అధ్వ ర్యం లో కదిరిబాబురావు దంపతులు ప్రత్యేక పూజలు చేసి దర్వాజాలు నిలిపారు. కార్యక్రమంలో కదిరి బాబురావు రాణి దంపతులు కుమారుడు భువ నేష్, అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చందు శ్రీనివాస్, మాధవి దంపతులు, కదిరి రమణయ్య రమణమ్మ దంపతులు కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు అభిమానులు స్థానికులు పాల్గొన్నారు.

## బేస్తవారిపేటలో పర్యటించిన సబ్ కలెక్టర్ రాహుల్ మీనా



బేస్తవారిపేట, మేజర్‌న్యూస్: పట్టణంలో మార్కాపురం సబ్-కలెక్టర్ రాహుల్ మీనా (ఎన్‌హెచ్-544డి) రోడ్డు గురించి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడడం జరిగింది. ఇటీవల తరచుగా జరుగుతున్న ప్రమాదాల విషయమై ప్రజలతో ప్రస్తావించి విషయాలు సేకరించారు. దీనికి సంబంధించి రోడ్డుకు మధ్యభాగం నుండి ఇరువైపులా 50 అడుగుల అవసరమని భూసేకరణ చేస్తామని, దీనికి సంబంధించి బాధితులకు ప్రభుత్వం వారు నష్టపరిహారం చెల్లిస్తారని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారులతో మాట్లాడవలసినదిగా మార్కాపురం సబ్-కలెక్టర్ తెలిపారు. అతి త్వరలో పనులు ప్రారంభించాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమ ంలో మండల రెవెన్యూ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలలో ఎమ్మెల్యేలు జనార్ధన్, విజయ్ కుమార్




సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని సంతనూతలపాడులో బుధవారం జరిగిన టిడిపి నేత ఆళ్ల రాము కుమార్తె బిందు భార్గవి వివాహ వేడుకలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్‌లు పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, టిడిపి నాయకులు నల్లమోతు శ్రీనివాసరావు, రంపతోటి అంకారావు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## 250 అడుగుల జాతీయ జెండాతో హర్ ఘర్ కా తిరంగా ర్యాలీ



కర్లపాలెం,మేజర్‌న్యూస్. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా కర్లపాలెం శ్రీ భార్గవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో 2005 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత పేరాల వెంకట సురేష్ మాట్లాడుతూ జాతీయ భావాన్ని అందరిలో కలుగజేయాలనే ఉద్దేశంతో జాతీయ జెండాతో కర్లపాలెం వీధులలో భారీ ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు జాతీయ భావాలతో కూడిన నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు: అనగాని



రేపల్లే, మేజర్‌న్యూస్: 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా దేశ ప్రజలందరికీ రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా పెట్టి పోరాడారని, వారందరినీ ఈ సందర్భంగా స్మరించుకుందామని అన్నారు. వారి త్యాగాల పునాదులపైనే మన దేశ నిర్మాణం సాగిందన్నారు. వీరందర్ని స్మరించుకుంటూ ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలని ప్రధాని మోదీ హర్ ఘర్ తిరంగా నినాదమిచ్చారని, దీన్ని అందరూ ఆచరించాలని కోరారు. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ సాధన కోసం కృషి చేయాలని మంత్రి అనగాని పిలుపునిచ్చారు.



## స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు: దారపనేని

పామూరు, మేజర్‌న్యూస్: కనిగిరి నియోజకవర్గ ప్రజలకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ 78వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వందేమాతరం అనే విప్లవ నినాదంతో ఎందరో మహనీయుల బలిదానాలతో, ఎందరో త్యాగమూర్తుల ప్రాణత్యాగాలతో భారతదేశానికి 1947 ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్యాన్ని ప్రకటించారన్నారు. దేశం పట్ల ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగేలా ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఆ మహాత్ముల, ఆ మహనీయుల చరిత్రలు ఈ తరం వారికి తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దారపనేని పేర్కొన్నారు.

## సెల్ఫీ ఛాలెంజ్ కు పిలుపునిచ్చిన కలెక్టర్ మురళి



బాపట్ల, మేజర్‌న్యూస్: ఇంటింటి పై జాతీయ జెండా ఎగుర వేసే కార్యక్రమం జయప్రదంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం అమరావతి నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. తిరంగా యాత్ర కార్యక్రమాలు అన్ని ప్రాంతాలలో నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఈ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. జాతీయ జెండాతో సెల్ఫీ ఫోటోలను తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను బాగస్వాములను చేయాలన్నారు. ప్రజలలో జాతీయ భావాన్ని నింపాలన్నారు. ప్రభుత్వ కార్యాలన్నింటిలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు జరపాలన్నారు. స్థానిక సంస్థలలోనూ స్వాతంత్ర వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమాల నిర్వహణపై విస్తృత ప్రచారం, ప్రదర్శన నిర్వహించాలన్నారు. ప్రజలలో జాతీయ భావాన్ని పెంపొందించడానికి అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాహనాలకు సైతం జాతీయ పతాకాలను తగిలించుకొని నగరం, పట్టణాలలో ప్రదర్శనలు చేసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి జాతీయ జెండాను చేతబూని ఫోటోలు తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్సైట్లో అప్లోడ్ చేశారు. జిల్లా ప్రజలంతా ఇదే మాదిరిగా జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకుని వెబ్సైట్లో పంపాలని కోరారు.

# రాష్ట్ర ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

## మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, మేజర్ న్యూస్: రాష్ట్ర ప్రజలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 78వ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 78 ఏళ్ల స్వాతంత్ర్యంలో భారతదేశం ఎంతో అభివృద్ధిని సాధించిందని, ప్రపంచ పటంలో భారతదేశానికి ఒక ప్రత్యేకతను చాటుకున్న ఈ స్వాతంత్ర దినోత్సవాన్ని దేశ ప్రజలందరూ ఆనందంగా పండుగ లాగా జరుపుకోవాలని మంత్రి గొట్టిపాటి ఆకాంక్షించారు. ఎంతో మంది మహనీయుల త్యాగ ఫలితమే ప్రస్తుతం మనం స్వేచ్ఛగా బ్రతకడానికి కారణమన్నారు.అనేక మంది మేధావులు దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారన్నారు.భారతదేశం మానవజాతి ఆవిర్భావ వికాసాలకు, ఉత్కృష్టమైన ఆధ్యాత్మిక తాత్విక చింతనకు, ఉన్నతమైన నాగరికతకు, సాంప్రదాయాలకు పుట్టినిల్లని, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రనూ ఆదర్శాలనూ, నేటి తరానికి తెలియజేయాలనే సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో కొనసాగుతుందని తెలిపారు. రానున్న రోజులలో రాష్ట్ర ప్రభుత్వం ప్రగతి బాటలో సంక్షేమ అభివృద్ధి దిశగా పరిపాలన కొనసాగిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

# నూర్‌బాషా దూదేకుల సమస్యలు పరిష్కరించాలి

## రాష్ట్ర యూత్ అధ్యక్షులు డి.పెద్ద మస్తాన్



తర్లుపాడు, మేజర్‌న్యూస్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నూర్‌బాషా దూదేకుల సామాజిక వర్గ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఏపీ నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు మరియు కేతగుడిపి సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ శాఖా మంత్రి షేక్ ఫరూక్‌ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం అందించారు. నూర్‌బాషా దూదేకుల సామాజిక వర్గీయులను ఇండియన్ హిందూ దూదేకులుగా కాకుండా, ఇండియన్ ఇస్లాం దూదేకులుగా శాశ్వత జీవో విడుదల చేయాలని కోరారు. 20 లక్షలకు పైగా జనాభా కలిగిన దూదేకులకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. దూదేకుల సమస్యలు విన్న మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

## పువ్వాడి, ఏలూరి





పామూరు, మేజర్‌న్యూస్: 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలకు తెలుగుదేశం పార్టీ పామూరు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటే శ్వర్లు, టిడిపి ఒంగోలు పార్లమెంటు కమిటీ తెలుగు రైతు అధ్యక్షులు ఏలూరి వెంకటేశ్వర్లు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో త్యాగధనుల బలిదానాలు మరెందరో స్వాతంత్ర్య సమరయోధులు చూపిన చొరవతో నేడు మనం స్వేచ్ఛ వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు.

# యువత వివేకానంద, అబ్దుల్‌కలాంల స్ఫూర్తితో ముందుకుసాగాలి

## ‘యువజాగృతి’ సభలో ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్





చీమకుర్తి, మేజర్‌న్యూస్‌: వివేకానంద, అబ్దుల్‌కలాం స్ఫూర్తితో నేటి యువత మందుకెళ్లాలని, యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం చీమకుర్తి పట్టణంలోని యం.యస్.ఆర్.కళాశాలలో "యువజాగృతి"కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.శివారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలల్లో రాణించాలన్నారు. విద్యనేర్పిన గురువులకు, తల్లితండ్రులకు, సమాజానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. పాత్రుని నాగార్జున, డా.ఎం.హరికృష్ణ కార్యక్రమానికి నిర్వహకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు చలువాది బదరీ నారాయణ, నూనె సుబ్రహ్మణ్యంలు హాజరై యువతకు సందేశానిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్నం ప్రసాదు, సూరంపల్లి హనుమంతరావు, గంగాదర్, కె.రాఘవ, రావిపాటి రాంబాబు, అడకా స్వాములు, యడ్లపల్లి బ్రహ్మం, అంకమ్మరావు, అవిశినేని వెంగన్న, గొల్లపూడి సుబ్బారావు, బొడ్డు శంకర్, బి.వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు శివప్రసాదు, యాసన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పండుగలా హర్ ఘర్ తిరంగా







పొదిలి, మేజర్ న్యూస్ : ఆజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడి పిలుపు మేరకు స్టేట్ మరియు జిల్లా యువజన సంక్షేమ శాఖ హిందుస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ అసిస్టెంట్ కమిషనర్ షేక్ రజిఖ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో భారి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు హర్ ఘర్ తిరంగా ను ప్రతి ఒక్కరు పండుగ వాతవారణంలో చేసుకొవాలని,స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోని వారి త్యాగులను గుర్తు చేసుకొవాలని కొరారు. అనంతరం స్థానిక విశ్వనాదపురం సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి విద్యార్ధులతో ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో హిందుస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ అసిస్టెంట్ కమిషనర్ షేక్ రజిఖ్, ఎం.వి.ఎస్ లోకేశ్వరరావు,కళాశాల ప్రిన్సిపాల్ తారావాణి, ఎ.మాధవచారి, ఉపాధ్యాయులు పద్మారావు, షకీనాబీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ



అద్దంకి, మేజర్ న్యూస్: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక హర్షిణి డిగ్రీ కాలేజీ లోని విద్యార్థులకు, సమీపంలోని స్థానికులకు 100 జాతీయ జెండాలు పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది.పలువురు వక్తలు మాట్లాడుతూ ఎంతో మంది వీరుల త్యాగ ఫలం మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్రమని, దానిని మనం రక్షించు కోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ ఒడిదుడుకులు పడుతూ తప్పటడుగులు వేస్తున్నాయని భారత దేశం ఒక్కటే ప్రజా స్వామ్య యుతంగా పురోగమిస్తూ ముందుకు పోతున్నదని పేర్కొన్నారు.జెండా ప్రాముఖ్యతను గురించి వివరించారు.ప్రతీ ఒక్కరూ దేశాన్ని ప్రేమించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, చిన్ని మురళీ కృష్ణ, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, కళాశాల ప్రిన్సిపాల్ రొటేరియన్ పి.ఎల్.వి. నరసింహారావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి, అళహరి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 150 అడుగుల జాతీయ జెండాతో చైతన్య విద్యార్థుల ర్యాలీ





చీమకుర్తి, మేజర్‌న్యూస్‌: చీమకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌లోని శ్రీ చైతన్య విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 150 అడుగుల భారీ జాతీయ జెండాతో పాఠశాల నుండి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉజ్వల్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశభక్తి నాయకులను మరియు స్వాతంత్ర్య ఉద్యమంలో వారి యెక్క పాత్రను గుర్తు చేసుకోవటం జరిగింది. విద్యార్థి దశ నుంచే దేశంపట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు భంగం కలిగేలా ప్రవర్తించకూడదని ప్రిన్సిపాల్ నీలిమాదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజియం అంజయ్య, రీజనల్ ఇంచార్జ్ అనిల్ కుమార్, డీన్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# 200 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

మార్టూరు, మేజర్‌న్యూస్: 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్టూరులో 200 అడుగుల పొడవైన జాతీయ జెండాతో శ్రీహర్షిణి పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జెండాని చేత పట్టుకొని ప్రధాన రహదారిలో నినాదాలు చేస్తూ ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నడిచారు. స్వాతంత్ర ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన దేశభక్తి నాయకులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశ నుంచే దేశభక్తిని కలిగి ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ఎస్పీ దామోదరకు ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వానం

నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో ఈనెల 18న మహాగణపతి జంట నాగులు ప్రసన్నాంజనేయ గురు దత్తాత్రేయ సరస్వతి శిఖర జీవ ధ్వజయంత్ర ప్రతిష్ట మహోత్సవానికి హాజరుకావాలని జిల్లా ఎస్పీ దామోదర్‌కి మద్దిరాలపాడు గ్రామస్తులు ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెప్పల కృష్ణమూర్తి, తెలుగుదేశం పార్టీగ్రామ మాజీ అధ్యక్షులు తాళ్లూరి కృష్ణారావు, తెలుగుదేశం నాయకులు పాలుడుకు మురళి, తాళ్లూరి అంజిబాబు, గుమ్మడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## సబ్ జైల్‌ను సందర్శించిన సివిల్ జడ్జి శ్యాంబాబు

మార్కాపురం రూరల్, మేజర్‌న్యూస్: పట్టణంలోని స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ సెక్రటరీ, మార్కాపురం సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్యాంబాబులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ జైల్లోని పరిసరాలను, నీటి వసతి, ఖైదీలకు అందించు భోజన వసతి, పాటించే మెనూ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు అందించిన సమాచారం ప్రకారం సంతృప్తి వ్యక్తపరిచి, ఖైదీల సమస్యలను, లాయర్లు లేనివారికి ప్రభుత్వం తరపున లాయర్లను ఏర్పాటు చేస్తామని ఖైదీలకు న్యాయమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీనల్ అడ్వకేట్ కె. రామయ్య, పిఎల్‌వి ఎస్‌కే బాషా, సబ్ జైల్ సూపరిండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.



## జాతీయ సమైక్యతను కాపాడడం మనందరి బాధ్యత

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో పెద్ద దోర్నాల మండలంలోని రామచంద్ర కోట గ్రామంలో ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఏపీ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాలు మేరకు ప్రకాశం జిల్లా బిజెపి అధ్యక్షులు పీవీ శివారెడ్డి సూచనల మేరకు పెద్ద దోర్నాల మండలంలోని రామ చంద్ర కోట గ్రామంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. దోర్నాల భాజపా అధ్యక్షులు సురవరం గండి వీరా రెడ్డి జాతీయ జెండాను ప్రతి ఇంటి పైన జెండాను ఎగిరేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెన్న లక్ష్మిరెడ్డి, కిసాన్ మోర్చా మండల పార్టీ అధ్యక్షులు అంబటి అల్లు రెడ్డి, బిజెపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## స్కిప్పింగ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

తాళ్లూరు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొన్న శ్రీ సరస్వతి హై స్కూల్‌కి చెందిన 10 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈనెల 10, 11 తేదీల్లో కడప జిల్లాలో 7వ ఆంధ్రప్రదేశ్ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలోపోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పి. పూర్ణిమ స్పీడ్ స్పిరిట్‌లో మొదటి స్థానం సాధించగాఫ్రీ స్టైల్‌లో కీర్తి, స్పీడ్ హోప్‌లో సాయి జీవిత మొదటి స్థానం సాధించారు. విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్‌తోపాటు మెడల్స్ అందజేయడం జరిగింది. విజేతలైన విద్యార్థినికి చైర్మన్ ఏ.వి.రమణారెడ్డి హెచ్.ఎం.శ్రీరామమూర్తి, రత్నం, వెంకారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి యాకోబు, వెంకట్రావు, పీఈటీలు వికాస్, శిరీష అభినందించారు.

# ఎస్సీ కాలనీలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తం

- రోడ్లపై మురుగు, పట్టించుకోని పాలకులు

- సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని పాలెం వాసుల ఆందోళన





పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: మండలంలోని పుల్లలచెరువు మాదిగ పాలెంలో పారిశుధ్యం పడకేసింది. పాలెంలో ఎటు చూసినా మురుగు నీరు స్తంభించిపోయింది. ప్రధాన రహదారిపై డ్రెయినేజీ ప్రవహిస్తోంది. ఆ నీటిలోనే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతు న్నారు. అసలే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణలో గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారటంపై పాలెం వాసులు ఆందోళన చెందుతున్నారు. పాలెంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో నీరంతా రోడ్ల మీదకే చేరుతుంది. మురుగు పచ్చగా మారి దోమలు వృద్ధి చెందటంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ పాలకులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదని, ఇటీవల కురిసిన వర్షాలకు తమ బాధలు వర్ణనాతీతమని కనీసం బ్లీచింగ్ కూడా చల్లటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలు ఎవరికీ పట్టడం లేదని పాలెం వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాలెంలో డ్రైనేజీ పనులు చేపట్టి మురుగు నిల్వ లేకుండా చూడాలని పుల్లలచెరువు మాదిగ పాలెం కోరుతున్నారు.

### మట్టి రోడ్లతో తప్పని తిప్పలు....

పుల్లలచెరువు మాదిగ పాలెంలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్లు లేక గుంతల మట్టిరోడ్లతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మురుగు కాలువలు నిర్మించకపోవడంతో రోడ్లపై మురుగు చేరుతుంది. వర్షాకాలంలో మట్టిరోడ్లు బురదమయంగా మారడం రాకపోకలకు పాలెం వాసులు కష్టాలు పడుతున్నారు. సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని మాదిగ పాలెం వాసులు పాలకులకు మొరపెట్టుకుంటున్నారు. గత పాలకులు మాదిగ పాలెంను పట్టించుకున్న పాపాన పోలేదని ఎన్నిసార్లు అడిగినా పట్టి పట్టనట్టు వ్యవహరించారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.నివాస ప్రాతంలో చెత్తాచెదారం నిల్వ చేరుతోంది.కాలనీలో మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ చేరి దోమలు వృద్ధిచెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. రోడ్లకిరువైపులా, మురుగు కాల్వలు లేకపోవడమే ఇలాంటి పరిస్తితి వస్తుందని వాపోతున్నారు.

## తాళ్లూరు నుంచి శ్రీశైలంకు బస్ సౌకర్యం



తాళ్లూరు, మేజర్‌న్యూస్: ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకి డిపోకు చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీ ఎస్ఆర్‌టిసి) బస్సు ప్రయాణికుల సౌకర్యార్థం అద్దంకి నుండి శ్రీశైలంకు బుధవారం ప్రారంభమైన బస్సుకు తూర్పు గంగవరం గ్రామంలో గ్రామ ప్రజలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి పార్లమెంట్ కార్యవర్గ సభ్యులు మనం రమేష్ బాబు, శాగం కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, గ్రామ ఉప సర్పంచ్ వై.కాశి రెడ్డి, ఛైర్మన్ కే.గురు బ్రహ్మం, సీనియర్ నాయకుడు గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (చందన), జనసేన నాయకులు ఆవుల వెంకట రమణ, మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఇంఛార్జి గొట్టిపాటి లక్ష్మి దృష్టికి తీసుకు వెళ్ళగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అద్దంకి నుండి శ్రీశైలం వెళ్ళుటకు నూతనంగా బస్ ఏర్పాటు చేశారు. బొద్దికూరపాడు వచ్చిన బస్సుకు మహిళలూ వారు పోసి, పూలదండలు వేసి, హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి పండుగ వాతావరణంలో స్వాగతం పలికారు. ఈ బస్సు ఉదయం 6:30 గంటలకు అద్దంకిలో బయలుదేరి ముండ్లమూరు, తాళ్లూరు, తూర్పు గంగవరం, బొద్దికూరపాడు, రాజంపల్లి, పొదిలి, మార్కాపురం, దోర్నాల మీదుగా శ్రీశైలం ఒంటి గంటకు వెళుతుంది. తిరిగి మరలా శ్రీశైలంలో మధ్యాహ్నం 2.15 గంటలకు బయలుదేరి అదే మార్గంలో అద్దంకి రాత్రి 9 గంటలకు చేరుకుంటుంది. మారుమూల గ్రామీణ ప్రాంతాల నుండి ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంకు అద్దంకి డిపో నుంచి బస్‌ని ఏర్పాటు చేయడం పట్ల ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తూ బస్సు వచ్చుటకు కృషి చేసిన, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: స్థానిక బీసీ కాలనీలో యాంటీ లార్వా కార్యక్రమంలో భాగంగా వైద్య సబ్ యూనిట్ అధికారి సిహెచ్ రమేష్ మలేరియా సూపర్వైజర్ ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ దోమల నివారణ పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోశారు. వైద్య సబ్ యూనిట్ అధికారి రమేష్ మాట్లాడుతూ పగటిపూట కుట్టే దోమల వల్ల డెంగు చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయని నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయి అన్నారు. ఇళ్లలో పరిసరాలలో నీరు నిలవ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం నీరు నిలువ ఉన్న ప్రాంతాలలో ఏబేట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. స్థానిక ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు వైద్య సిబ్బంది తెలియచేశారు. ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండేటట్లు చూసుకోవాలని ఉన్నట్లయితే దోమలు వ్యాపించి అనేక జబ్బులకు కారణం అవుతాయని తెలియజేశారు. ఫ్రైడే డ్రై డే పాటించాలని తెలియజేశారు. తద్వారా దోమల వల్ల వచ్చే వ్యాధులను అరికట్టేందుకు వీలుంటుందని మరి ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ వ్యాధులను నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బీసీ కాలనీ మహిళలకు పిల్లలకు పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్వాడి కేంద్రం సెంటర్ కోడ్ 412 సందర్శించి ఆహార పదార్థాలను, నీటిని పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్త పి.మల్లేశ్వరి దేవికి తగు సూచనలు, సలహాలు, వైద్య సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిహెచ్ రమేష్, మలేరియా సూపర్వైజర్ ఇజ్రాయిల్, ఏఎన్ఎం పద్మావతి, ఆశావర్కర్లు సుకన్య, రాణి, అంగన్వాడి టీచర్ మల్లేశ్వరి దేవి పాల్గొన్నారు.

## సబ్ జైల్‌ను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ శ్యాంబాబు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని సబ్ జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ కె.శ్యాంబాబు సందర్శించారు. విచారణ ఖైదీలను వారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి బెయిల్ అప్లికేషన్ వేసుకొనే హక్కు ఉందన్నారు. సబ్ జైల్లో వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమత లేని వారికి, వారి కేసులను వాదించటానికై ఉచితంగా న్యాయవాదిని పొందవచ్చునని, దానికి సంబంధించి సంబంధిత మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి అర్జీ సమర్పించుకోవాలని తెలియజేశారు. న్యాయమూర్తులు గాని లీగల్ ఎయిడ్ న్యాయవాదిని గాని సబ్ జైల్‌ను సందర్శించినప్పుడు వారికి తమ సమస్యలను తెలుసుకోవచ్చని తెలియజేశారు. సందర్శన సమయంలో 14 మంది మగ విచారణ ఖైదీలు, 4గురు ఆడ విచారణ ఖైదీలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సిహెచ్ పోలయ్య, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధనరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## చుండూరి ప్రోత్సాహంతో 424వ రక్తదానం



అద్దంకి, మేజర్ న్యూస్: రోటరీ బ్లడ్ డొనేషన్ చైర్మన్ చుండూరి మురళి సుధాకర్ రావు ప్రోత్సాహంతో 424వ రక్తదానం బుధవారం జరిగింది.రక్త హీనతతో బాధ పడుతున్న నర్రావారి పాలెం నివాసి చాటకొండ మధు సూదనరావుకి రక్తం అత్యవసరమని డాక్టర్ సూచించగా, రోగి బంధువులు రోటరీ క్లబ్ కార్యదర్శి, బ్లడ్ డొనేషన్ చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు ని సంప్రదించారు. మురళీ సుధాకరరావు ప్రోత్సాహంతో మేదరమెట్ల గ్రామానికి చెందిన దేవరకొండ రాజా ఓ పాజిటివ్ రక్తం దానం చేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, పూర్వపు అధ్యక్షులు చిన్ని మురళీ కృష్ణ పాల్గొన్నారు.రక్తదానం చేసిన రాజా ని రోటరీ సభ్యులు అభినందించారు.

## సాహితీవేత్త గొట్టిముక్కుల నాసరయ్యకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ అవార్డు

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: మండలానికి చెందిన స్థానిక కవి, రచయిత గొట్టిముక్కుల నాసరయ్యకు బుధవారం గ్లోబల్ ఫౌండేషన్ మరియు ఆదరణ వెల్ఫేర్ సొసైటీ, (మార్కాపురం) స్థాపించి నేటికి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషిగాను, స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ అవార్డు 2024. గొట్టిముక్కుల నాసరయ్యకు అంతర్జాల మాధ్యమం ద్వారా అందజేశామని, చైర్మన్ గొట్టిముక్కుల చెన్నకేశవులు తెలిపారు.



## తహసీల్దార్‌ను కలిసిన ఖాదర్ వలి

కంభం, మేజర్‌న్యూస్: పట్టణంలోని నూర్ బాషా దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం వారు దూదేకుల విద్యార్థిని విద్యార్థులు కుల ధృవీకరణ పత్రం మంజూరు చేయడంలో వస్తున్న సమస్యలు, అభ్యంతరాలను కంభం మండల తహసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంభం మండల దూదేకుల సంఘం అధ్యక్షుడు డి.ఖాదర్ వలీ, డి.జిలాని, ఖాదర్ హుస్సేన్, న్యామతుల్లా, షేక్షావలి, ఫయాజ్ పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మార్టూరు, మేజర్‌న్యూస్: విజయనగర కాలనీ వెంకయ్య ఆశ్రమంలో ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గడ్డం మస్తాన్ వలి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గడ్డం మస్తాన్ వలి మాట్లాడుతూ ఎందరో మహాత్ముల త్యాగాల వల్ల భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకొని పేదలకు మేలు చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు బాబు ప్రసాద్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని కల్పించినందుకు ఆశ్రమం నిర్వాహకుడు రాజేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా పుస్తకాలు పంపిణీ చేసిన మస్తాన్ వలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బాబు ప్రసాద్ ఆశ్రమ నిర్వాహకుడు శివ రాజేష్, గడ్డం మస్తాన్ వలి పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన దేవసేన కుమారి



అద్దంకి, మేజర్ న్యూస్: అద్దంకి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా దేవసేనకుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు పూర్వం అద్దంకి ఎంపీడీవో బాపట్ల జిల్లా నిజాంపట్నంకు బదిలీ అయ్యారు. ప్రకాశం జెడ్పీ సీఈవో ఆదేశాల మేరకు ఎన్నికలకు పూర్వం పని చేసిన స్థానాల్లోనే ఎంపీడీవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.ఆమేరకు ఆమె తిరిగి అద్దంకి ఎంపీడీవో గా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం




వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండలంలోని మొగు లూరు పల్లె గ్రామం వద్ద స్కూల్ బస్సు ప్రమాదానికి గురై తృటిలో భారీ ప్రమా దాన్ని తప్పించుకున్నది. ఈ బస్సు గోగులపల్లి నుంచి కొటాలపల్లె వెలిగండ్ల మీదుగా కనిగిరికి మోడల్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులను పాఠశాల విద్యార్థులను సుమారు 100 మందిని ప్రతిరోజు తీసుకెళుతున్నగా బుధవారం ఈ బస్ మొగల్లూరుపల్లి గ్రామానికి చేరుకోగా అక్కడ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ తప్పించబోయి బస్సు రోడ్డు మార్జిన్ దిగి పొలంలోకి దూసుకుపోయి డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును నిలిపియడంతో వందమంది విద్యార్థులను రక్షించాడన్నారు.

## వనరుల ద్వారా లక్ష్యాలను చేరుకోవాలి




కొమరోలు, మేజర్‌న్యూస్: వనరులను సమకూర్చుకొని లక్ష్యాలను చేరుకునే విధంగా జిపిడిపి శిక్షణ ఉపయోగపడాలని ఏవో శ్రీనివాస్ కుమార్ బుధవారం జిపిడిపి శిక్షణ ముగింపు సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి స్థానిక ఇఒఆర్డి ఆదాం షఫీ అధ్యక్షత వహించారు. అనంతరం శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా సభ్యులను ఉద్దేశించి అధికారులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు గ్రామపంచాయతీలో ఏ విధమైన వనరులు ఉన్నాయి. వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలి, తద్వారా ఈ గ్రామ స్వరాజ్‌లో ప్రతి సంవత్సరం గ్రామపంచాయతీకి ఏదైతే లక్ష్యం ఏర్పాటు చేసుకుంటామో, ఆ లక్ష్యాన్ని ఏ విధంగా చేరుకోవాలో, దానికి అనుకూలంగా ప్రణాళికను ఏర్పాటు చేసుకొని ,ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను, స్థానిక వనరుల ద్వారా ఏర్పాటు చేసుకున్న వాటిని సద్వినియోగం చేసుకొని గ్రామపంచాయతీలు అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. శిక్షణ తరగతుల ద్వారా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు నేర్చుకున్న అంశాలను గ్రామ పంచాయతీలకు వెళ్లి వార్డు మెంబర్లకు, మిగిలిన సిబ్బందికి అవగాహన చేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన ఏర్పాట్లను చక్కబెట్టుకొని, ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ




చీమకుర్తి, మేజర్‌న్యూస్‌: 2024-25 సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక మొదలగు అంశములపై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు మరియు కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం చీమకుర్తి మండల పరిషత్ సమావేశం హాలులో పంచాయతీ కార్యదర్శులకు మరియు సర్పంచ్‌లకు మూడవ రోజు శిక్షణా కార్యక్రమం కొనసాగింది. వీది దీపాల ఏర్పాటు మరియు నిర్వహణ (ఎల్ఇడి) సిసి చార్జీల చెల్లింపులుపై అవగాహన కాల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా డిప్యూటీ డైరెక్టరు జె.రామనాధం హాజరై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులతో గత శిక్షణా తరగతులలో జరిగిన అంశములపై పునఃచరణ చేసి మరియు సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, రాబోయే నిధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టరు, ఎంపిడిఓ కె.రాఘవేంద్ర, ఇఓఆర్‌డి సి.హెచ్.శ్రీనివాసులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల అక్రమ తొలగింపులు మానుకోవాలి




మార్కాపురం, మేజర్‌న్యూస్: ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మూడవరోజు కార్మికులు నిరసన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డీకేయం రఫీ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని ఆయన వ్యతిరేకించారు. కార్మికులు రాజకీయాలకతీతంగా మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో గత 20 సంవత్సరాలుగా మున్సిపల్ పట్టణంలో తమ విధులు నిర్వహించడంలో అనేక మంది అధికారులు మెప్పు పొందారని, కార్మికులను ఎటువంటి కారణం లేకుండా కమిషనర్ ఏకపక్షంగా కొంతమందిని డ్యూటీలకు మానుకోండి చెప్పటాన్ని ఆయన వ్యతిరేకించారు. కార్మిక చట్టాలను అమలు చేయవలసిన అధికారులు అందుకు విరుద్ధంగా ఎటువంటి కారణాలు లేకుండా ఏకపక్షంతో కార్మికులను తొలగించడాన్ని ఆయన వ్యతిరేకించారు. కార్మికుల పట్ల కమిషనర్ వైఖరిని ఆయన ఖండించారు. ఆయన వైఖరి మార్చుకొని తొలగించిన కార్మికులను వెంటనే విధులు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు లేకుంటే కార్మికులంతా ఐక్యంగా మా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, యూనియన్ అధ్యక్షులు కే.సుబ్బరాయుడు, జి.హరి, పి.శ్రీను, ఆరేపల్లి రమణ, నాసరయ్య, ఎస్.కె ఇమాంసా, సలాం ఖాన్, అల్లూరయ్య, గురునాథం, ఎస్‌కే యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పని సరి



దర్శి, మేజర్‌న్యూస్: వాహనాలకు ప్రభుత్వ నియమాలు ప్రకారం ఉన్నా నెంబర్ ప్లేట్లు మాత్రమే బిగించాలని దర్శి సిఐ వై.రామారావు కోరారు. ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు బుధవారం దర్శి సిఐ రామారావు ఆధ్వర్యంలో దర్శి ఎస్ఐ సుమన్ గడియార స్థంభం సెంటర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్ లేని, సరైన నెంబర్ ప్లేట్ లేని వాహనాలను ఆపి సదరు వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలకు నెంబర్ ప్లేట్ సరిగా ఉన్న ఎడల వాహనాలు దొంగతనాలకు, యాక్సిడెంట్‌కు గురి అయిన సదరు వాహనాలను సులభంగా గుర్తించడానికి వీలు ఉంటుందని అన్నారు. వాహన యజమానులు వారి యొక్క వాహనాలకు ప్రభుత్వ నియమాల ప్రకారం ఉన్న నెంబర్ ప్లేట్ల మాత్రమే బిగించవలెను అలా బిగించని ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దర్శి మండలంలోని స్టిక్కరింగ్ షాప్ యజమానులు వాహనాలకు నెంబర్ ప్లేట్ వేయు సమయంలో ప్రభుత్వ నియమాల ప్రకారం మాత్రమే నెంబర్ ప్లేట్లను వేయవలెను అలా వేయని ఎడల సదరు స్టికరింగ్ షాపుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని సిఐ అన్నారు.

## వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ కోటయ్య



పొదిలి , మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పెద్ద బస్టాండ్, చిన్న బస్టాండ్ సెంటర్లో బుధవారం ఎస్ఐ జి కోటయ్య తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు, సైలెన్సర్ మార్చి పెద్ద శబ్దం చేసే వాహనాలను గుర్తించి వాటిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. వాహనదారులందరూ తమ తమ వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లను అమర్చుకోవడంతోపాటు కంపెనీ తో వచ్చే సైలెన్సర్లు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు.అలా కాకుండా నెంబర్ ప్లేట్ల స్థానంలో వివిధ రకాల వ్రాతలను లేదా చిత్రాలను ఉపయోగించడం మరియు విపరీతమైన శబ్దం చేసే సైలెన్సర్లను ఉపయోగించడం మోటార్ వెహికల్ చట్ట ప్రకారం నేరమని అలాంటి వాహనాలను చట్టపరంగా సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ప్రవీణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఇఓ కొండారెడ్డి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని ఆరేపాలెం, కంభంపాడు, రెడ్డిగారిపల్లె, కోమటిగుంట్ల, చింతపూడి పాఠశాలలను బుధవారం ఎంఇఓ ఆర్.కొండారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం అమలుతీరు,నాణ్యతను పరిశీలించి విద్యార్థుల సంఖ్యను బట్టి తగినంత కందిపప్పు నూనె కూరగాయలు ఇతర వస్తువులు వేయాలని భోజనం రుచికరంగా నాణ్యతాయుతంగా ఉండాలని ప్రభుత్వం సూచించిన మెనూ తప్పనిసరిగా పాటించాలని ముఖ్యంగా భోజనం తయారుచేసే వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వంటనిర్వాహకులకు ఎంఇఓ సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను భోదించి సకాలంలో సిలబస్ పూర్తిచేసి పరీక్షలకు సన్నదం చేయాలని ప్రభుత్వం ఆదేశాలమేరకు పాఠశాల సముదాయ సమావేశం రెండురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంఇఓ అన్నారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## రంగయ్య మృతి టిడిపికి తీరని లోటు



దర్శి, మేజర్‌న్యూస్: పట్టణ టిడిపి నాయకులు తాండవ పెద్ద రంగయ్య మృతి టిడిపికి తీరని లోటు అని మాజీ ఎమెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు దర్శి సొసైటీ మాజీ నెంబర్ తాండవ రంగయ్య తండ్రి పెదరంగయ్య బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూలమాల లేసి దర్శి టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే నారపు శెట్టి పాపారావు, దర్శి పట్టణం టిడిపి అధ్యక్షులు యాదగిరి వాసు, సంఘ తిరుపతి రావు, జూపల్లి కోటేశ్వరరావు, కర్ణ శ్రీను, కూటాల శ్రీను నివాళులర్పించారు.

# సెప్టెంబర్ 1న ఒంగోలులో ఇంటర్ స్టేట్స్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు

## బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు, మేజర్‌న్యూస్: విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణను ఇస్తున్న నల్లూరి మోహనరావు అభినందనీయుడని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడుతున్నాయని అటువంటి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన ఒంగోలు మహాలక్ష్మి కళ్యాణమండపంలో జరుగుతున్న ఇంటర్ స్టేట్స్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల బ్రోచర్‌ను ఆయన నివాసంలో ఆవిష్కరించారు. 40 ఏళ్లుగా వేలాది మందికి కరాటే లో శిక్షణను ఇస్తున్న మోహనరావు ఇప్పటికీ కరాటే వృత్తి ద్వారా ఎంతో మందిని శిష్యులను తయారు చేయడం గర్వకారణం అని పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ జరిగే ఇంటర్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల నుండి సుమారు 1000మంది కరాటే విద్యార్థులు హాజరవటం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు అందరు కృషి చేయాలని దామచర్ల పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్‌ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకృష్ణ, ప్రతిభ కళాశాల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, నగర అభివృద్ధికమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, మండవ సుబ్బారావు, దుగ్గినేని వెంకట్రావు, నాగరాజు పాల్గొన్నారు.

# ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

## ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ 78 ఏళ్ల స్వాతంత్ర్యంలో భారతదేశం ఎంతో అభివృద్ధిని సాధించిందని అన్నారు. ప్రపంచ పటంలో భారతదేశానికి ఒక ప్రత్యేకతను చాటుకున్న ఈ స్వాతంత్ర దినోత్సవాన్ని దేశ ప్రజలందరూ ఆనందంగా పండుగ లాగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఎంతో మంది మహనీయుల త్యాగ ఫలితమే ప్రస్తుతం మనం స్వేచ్ఛగా బ్రతకడానికి కారణమన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని ఆయన కోరారు.

# అగ్రిగోల్డ్ భూములను కాజేసిన జోగి రమేష్ కుటుంబ సభ్యులు

## అవినీతి, అక్రమాలు చేస్తూ బిసీ కార్డు అడ్డం పెట్టుకోవడం హేయమైన చర్య

## టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ



ఒంగోలు, మేజర్‌న్యూస్: వైసిపి నేత జోగి రమేష్ కుటుంబ సభ్యులు అవినీతి, అక్రమాలు చేస్తూ బీసీ కార్డును అడ్డం పెట్టుకోవాలని చూడటం హేయమైన చర్య అని టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ అన్నారు. ప్రకాశం జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు డా.నూకసాని బాలాజీ మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని జోగి రమేష్ కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలు పుట్టలో నుంచి పాములు బయటకు వచ్చినట్లు ఒక్కోటి బయటకు వస్తున్నాయి. అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన నిలబడతామని 2019కి ముందు ఊరూరా తిరిగి ఎన్నికల ప్రచారంలో చెప్పిన వైసీపీ నేతలు అధికారంలోకి రాగానే అగ్రిగోల్డ్ భూములను స్వాహా చేశారు. అగ్రిగోల్డ్ భూముల అన్యాక్రాంతంపై అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదుపై పోలీసు అధికారులు సుదీర్ఘ విచారణ తర్వాత చర్యలు తీసుకోవడం జరిగింది. విజయవాడ రూరల్‌లోని అంబాపురం గ్రామంలో అగ్రిగోల్డ్‌కు ఉన్న భూములు ఈడీ ఎటాచ్మెంట్లో ఉన్నాయి. జీవో నెం.117, తేదీ:14.08.2018, జీవో నెంబర్:133, తేదీ:17.10.2019న స్పష్టంగా ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. విజయవాడ రూరల్లోని అంబాపురం గ్రామంలో సీఐడి ఎటాచ్మెంట్లో ఉన్న భూమిని జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్, రమేష్ బాబాయ్ జోగి వెంకటేశ్వరరావు పేర్ల మీద సర్వే నెం.88లోని 2160 చ.గ. భూమిని కొనుగోలు చేశారు. ఈ అక్రమాలపై అగ్రిగోల్డ్ సంస్థ ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు దర్యాప్తు జరిపి జోగి రాజీవ్‌ను అదుపులోకి తీసుకోవడం జరిగింది అంతే తప్పా దీనిపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవన్నారు. బీసీల మీద దాడులు వైయస్సార్ జమానాలో అచ్చెన్నాయుడు దగ్గర నుంచి మాచర్లలో తోట చంద్రయ్య దాకా బీసీలపై దౌర్జన్యాలు చేసింది వైసిపి అని, చివరకు చంద్రబాబు నాయుడు ఇంటి వద్ద చొక్కా ఊడ తీసి జులుమ్ ప్రదర్శించిన చరిత్ర నీది అన్నారు. బీసీలకు న్యాయం చేసే పార్టీ తెలుగుదేశం, బీసీలపై దౌర్జన్యాలు చేసిన పార్టీ వైఎస్ఆర్ పార్టీ అని దీనిని ప్రజలు గుర్తించారు కాబట్టే మిమ్మల్ని 11 సీట్లతో పరిమితం చేశారని, దుర్మార్గంగా ఎవరు వ్యవహరించిన వారి మీద చట్టపరమైన చర్యలు ఉంటాయని చట్టం తన పని తాను చేసుకుపోతుందని నూకసాని బాలాజీ తెలియజేశారు.







# 78వ స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

## పోలీసుల కవాతు రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు, మేజర్‌న్యూస్: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఒంగోలులోని పోలీసు పరేడ్ మైదానం సర్వం సిద్ధం అయ్యింది. అధికార యంత్రాంగం ఏర్పాట్లన్ని పూర్తి చేశారు. నేడు జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పరిశీలించారు. ఏఆర్ డిఎస్పీ చంద్రశేఖర్‌పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. రిహార్సల్స్‌లో భాగంగా ముందుగా సిబ్బంది నుండి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకం ఎగుర వేశారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించి కవాత్‌ను నిర్వహించడంలో కొన్ని సూచనలు, మెళుకువలు సూచించారు. రేపు మరింత ఉత్సాహంగా కవాతు ప్రదర్శన చేయాలని సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవం నాడు వేడుకలకు హాజరయ్యే ముఖ్యఅతిథులు, ప్రజానీకానికి దేశ ఉన్నతిని చాటేలా పోలీస్ పరేడ్ సాగాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ రోజున జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన, తదితర వేడుకలకు విచ్చేయనున్న స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, ప్రజలకు కల్పించాల్సిన భద్రతలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైమ్) శ్రీధర్ రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణా రెడ్డి, సీతారామిరెడ్డి, ఆర్ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

# 16న ప్రకాశం తొలి కలెక్టర్ కత్తి చంద్రయ్య శత జయంతి వేడుకలు

## మీడియాతో మనవరాలు అంగలకుర్తి నిహారిక



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఈనెల 16వ తేదీన ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్ కత్తి చంద్రయ్య శత జయంతి వేడుకలను ఒంగోలులో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన మనవరాలు అంగలకుర్తి నిహారిక తెలియజేశారు. బుధవారం ఒంగోలులోని ఎంసిఏ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 16వ తేదీ సాయంత్రం 4.30కి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జయంతి వేడుకలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ జయంతి వేడుకలకు ప్రకాశం జిల్లా మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి, బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలు కత్తి చంద్రయ్య అభిమానులు పాల్గొని ప్రకాశం జిల్లా కలెక్టర్ అయినటువంటి కత్తి చంద్రయ్య జయంతి వేడుకలు జయప్రదం చేయవల్సిందిగా కోరారు. ఈ పత్రిక సమావేశంలో కత్తి చంద్రయ్య మనవడు సందీప్, అంగలకుర్తి కనిష్కా, ఆనంద్ పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్





మద్దిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని మద్దిపాడు కందుల ఓబుల్ రెడ్డి జలాశయం (గుండ్లకమ్మ)కు వెళ్ళు దారిలో ఉన్న ఆర్చి వద్ద బుధవారం ఐదుగురు అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసు వారు అరెస్ట్ చేశారు మద్దిపాడు ఎస్ఐ వెలగా మహేష్ కథనం ప్రకారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్లను దొంగతనం చేసేవారు, గంజాయి అక్రమ రవాణా చేసే పసుమర్తి లక్ష్మీనారాయణ తండ్రి పేరయ్య వినుకొండ, మల్లెల కొండారెడ్డి తండ్రి వెంకటనారాయణరెడ్డి, చాకిరాల కనిగిరి మండలం, ఆరిఫ్ తండ్రి గౌస్ బాషా ఇస్లాంపేట ఒంగోలు, నాగులూరి బాలరాజు తండ్రి బుడ్డ నాగేష్, కనిగిరి టౌను కుంచా లంకమ్మరాజు తండ్రి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరకాలనీ చీమకుర్తి అను ఐదుగురు సభ్యులను పోలీసు వారు అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు కనిగిరి ప్రాంతంకు చెందిన వారు ఒకరు పల్నాడు జిల్లా వినుకొండవాసి, ఒకరు చీమకుర్తి, వారు ఆటోలు తోలుకుంటూ చెడు వ్యసనాలకు బానిసలై ఈ విధంగా డబ్బు సంపాదనకు అలవాటుపడి ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్లు రాగి తీగలు దొంగలించడం, గంజాయిని ఒకచోట నుండి మరొక చోటకు అక్రమ రవాణా చేయటం చేస్తూ వాటిపై వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. మండల పరిధిలో ఎవరైనా గంజాయి రవాణా చేసినా, అమ్మినా, వినియోగించినా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేష్ అన్నారు. వీరిని పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ దామోదర్ అభినందించి ప్రశంసా పత్రాలు ఇచ్చారు.

# తర్లుపాడు పంచాయతీ నిధులు గోల్‌మాల్

తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన తర్లుపాడు పంచాయతీ నిధులు యదేచ్ఛగా గోల్మాల్ అవుతున్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ఎనిమిది నెలల నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా 25 లక్షల రూపాయల మేర నిధులను పంచాయతీ నుండి డ్రా చేశారు. ఎక్కువగా బ్లీచింగ్ పౌడర్, పారిశుద్ధ్యం, బోర్ల మరమ్మత్తులు, సచివాలయం మెయింటినెన్స్, చెత్త ట్రాక్టర్ డీజిల్, డంపింగ్ యార్డ్ అభివృద్ధి కొరకంటూ నిధులు డ్రా చేశారు. ఈ నెల మూడున ఎలాంటి బిల్లు లేకుండా మండల స్థాయి అధికారులకు కూడా తెలియకుండా నాలుగు లక్షల పదహారు వేల రూపాయలను కార్యదర్శి సర్పంచ్ సొంత అకౌంట్లోకి నిధులను వేసుకున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారము సర్పంచ్ కార్యదర్శి సొంత అకౌంట్లోకి డబ్బులు వేసుకోకూడదు. నిబంధన ఉన్నప్పటికీ ఈ నిబంధనలన్నిటినీ ప్రక్కన పెట్టి నిధులు డ్రా చేసుకున్నారు. చెత్త ట్రాక్టరు డీజల్ కొరకు 264000 డ్రా చేశారు ట్రాక్టర్కు అసలు డ్రైవరే లేడు చుట్టం చూపుగా ఎప్పుడో ఒకరోజు ఒక ట్రిప్పు చెత్తను తల్లిస్తారు సైడ్ కాలవలు తీసిన దాఖలాలు లేవు కానీ రూ.280000 డ్రా చేశారు. కేవలం సచివాలయం మెయింటినెన్స్ కొరకు రూ.1,95,000ను డ్రా చేశారు. బోర్ల మరమ్మత్తులు. మోటర్లు బిగించినందుకు సుమారు 7 లక్షల రూపాయల మేరకు నిధులు డ్రా చేశారు ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీ కార్యదర్శి అక్రమాలు రోజుకొకటి వెలుగులోకి వచ్చింది. ఇదేమిటని ఎవరైనా ప్రజలు పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే, నేను దళిత నాయకుడిని మీ పైన కేసులు బనాయిస్తానంటూ బెదిరింపులకు గురి చేస్తాడు. గత రెండు నెలల క్రితం ఒక విలేకరు పంచాయతీ నిధులు సమాచార అడుగుతే అతనిపై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టాడు పంచాయతీ రికార్డులు కనిపించడం లేదని వీఆర్వో భాస్కర్ రెడ్డి పై కూడా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. గత మూడు సంవత్సరాల నుంచి ఈ పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు చేసిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపితే, ఎన్ని లక్షల మేర గోల్మాల్ జరిగిందో తేటతెల్లం కానుంది. తర్లుపాడులో పారిశుద్యం పడకేసినప్పటికీ పారిశుధ్య పనులు చేస్తున్నట్లు ఎక్కువ నిధులు గోల్మాల్ చేయడం గమనార్హం. తర్లుపాడు ప్రతి వీధిలో లైట్లు వేసినట్లు 1,31,000 రూపాయలను డ్రా చేశాడు. కానీ ఏ వీధిలో చూసినా అంధకారమే దర్శనమిస్తుంది మండలంలో పంచాయతీ కార్యదర్శులు చేసే అవకతవకులను అరికట్టాల్సిన ఈవో పీఆర్డి బాలకృష్ణ తీసుకొని సంతకాలు చేస్తున్నట్టు సమాచారం ఇప్పటికైనా




ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు చేపట్టవలసిందిగా గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## నూతన తహసిల్దార్ కృష్ణారెడ్డికి అభినందనలు

పొదిలి, మేజర్ న్యూస్ : తహాసిల్దార్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం వి కృష్ణారెడ్డిని ఆర్యవైశ్య నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సాలువ కప్పి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో టిడిపి మహిళా నాయకురాలు సోమిసెట్టీ శ్రీదేవి,ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధికార ప్రతినిధి ఒగ్గు వెంకట్రామయ్య ,టీడీపి నాయకులు భూమా శ్రీను,మేడా చిన సుబ్బారావు,భూమా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ సిఐగా రామకోటయ్య బాధ్యతలు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన జె. రామకోటయ్య కొత్తగా పదవి బాధ్యతలు చేపట్టిన జే.రామ కోటయ్యకు గిద్దలూరు పోలీస్ సిబ్బంది ఘనస్వాగతం పలికారు.



## సుభాష్ చంద్రబోస్‌కి బీజేపీ నేతలు ఘన నివాళి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా,రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి, జిల్లా అధ్యక్షులు పివి శివా రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు హార్ ఘర్ తీరంగా కార్య క్రమంలో బాగంగా గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపి సెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో గిద్దలూరు పట్టణంలో నంద్యాల రోడ్‌లో గల స్వతంత్ర సమర యోధులు సుభాష్ చంద్రబోస్‌కు పుల మాల వేసి ఘన నివాళి తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జెవి నారాయణ, జిల్లా మేధో కమిటీ మెంబర్ రెడ్డి మల్లారెడ్డి సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, గిద్దలూరు రూరల్ మండలం అధ్యక్షులు కె.తిరు పాల్ రెడ్డి, జిల్లా ఓబిసి కార్య దర్శి వీర చక్రం, గిద్దలూరు పట్టణ జనరల్ సెక్రటరీ మునగ నూరి రామకృష్ణ, వేమూరి శ్రీనివాసులు పాల్గొనడం జరిగింది.

## విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి





కొండేపి, మేజర్‌న్యూస్: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం కొండేపిలోని దాసరెడ్డిపాలెం పాలెంలో జరిగింది. స్థానికులు తెలియజేసిన వివరాలు ప్రకారం కాటం గురవారెడ్డి అనే రైతు 50 సంవత్సరాలు తమ పోలంలో విద్యుత్ వైరు లాగుతుండగా ఆ వైరుకి విద్యుత్ సరఫరా కావడంతో గురవారెడ్డి అక్కడికక్కడే వ ం ృ తి చ ె ం ది న ట ్ల తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న స్థానిక యస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## సీతారామచంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలో వెలిగండ్లలో నూతనంగా సీతారామచంద్రస్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈనెల 15, 16, 17, 18 తేదీల్లో జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈనెల 15వ తేదీ గురువారం ప్రతిష్ట సంకల్పం, కోలాటం, 16 శుక్రవారం ఉదయం మూలమంత్ర జపాదవులు కాలేషా అర్చనలు హోమాలు భక్తులచే క్షీరాభిషేకం మూల విగ్రహాల గ్రామోత్సవము ధ్యానతివాసము పూజ హారతి సాయంత్రం మూల మంత్ర జపాదులు హోమ వాళ్లు కలసిన అర్చనలు విశేష స్వప్నము సయాదివాసము తీర్థ ప్రసాద వినియోగం రాత్రి 9 గంటలకు కోలాటం, 17 శనివారం ఉదయం మూలమంత్ర జపాదులు, హోమాలు, రత్నం ధ్యాన దాతున్యాస విగ్రహ ప్రతిష్ట స్వర్ణాంతులు కళావాహన పూర్ణాహుతి కుంబాభిషేకం గోఅగ్ని అన్న దర్పణ పూరికా నేత్రాన్ని ప్రథమ పూజ హారతి ప్రసాద వినియోగం సాయంత్రం సీతారామచంద్రస్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం జరుగును. కార్యక్రమాలు అన్నిటిని వెలిగండ్ల వాస్తవ్యులైన సురభి సుబ్రహ్మణ్య శర్మ వారి బృందంచే జరగబడును గ్రామస్తులు తెలిపారు. ఈ దేవాలయము గత 50 సంవత్సరాల నుంచి పాత స్లాబ్ గదిలో ఉండగా నేడు సుమారు 80 లక్షలు వసూలు చేసి అక్కడ ఉన్న చిట్టి వెంకటసుబ్బయ్య సతీమణి వెంకటమ్మ వారి కుమారులు చిట్టి ఆనందరావు చిట్టి నరసింహారావు సూర్య విలేకరి లక్ష్మయ్య వారు 12 ఇంటూ 18 స్థలం ఇవ్వగా నేడు ఆ స్థలములో ఈ సీతారామ దేవస్థానం జరుగుతున్నది. మండలంలోని వేలాది మంది భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసిందిగా కమిటీ వారు తెలిపారు. ఈ మూడు రోజులు మూడుపూట్లా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని వారన్నారు. 18వ తేదీ బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుంది గ్రామస్తులు తెలిపారు.

## శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ధ్వజయంత్ర బ్రహ్మోత్సవం



నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: మద్దిరాలపాడు గ్రామంలో ఈనెల 18న ప్రతిష్ఠించిన మహా గణపతి చంటనాగులు ప్రసన్నాంజనేయ గురుజాతాత్రేయ సరస్వతి శిఖర జీవ ధ్వజయంత్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ప్రసన్న ఆంజనేయ స్వామి ధ్వజయంత్ర గ్రామోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక పూజలు దాతలు కాటా శ్రీనివాసులు సతీమణి విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెప్పల కృష్ణమూర్తి సతీమణి ఉమాదేవి తోపాటు గ్రామ పెద్దలు పెనుబోతు సునీల్ పెనుబోతు చిట్టిబాబు చెరుకు రమేష్ బాబు తాళ్లూరి కృష్ణారావు ఉద్దినేని ఏడుకొండలు ఉద్దినేని శేషయ్య తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామోత్సవంలో ధ్వజయంత్రానికి భారీగా గ్రామస్తులు పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి తీర్థప్రసాదాలు సేకరించారు.

## ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



కొండేపి, మేజర్‌న్యూస్: డెబ్బై ఎనిమిదోవ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొండేపి నియోజకవర్గ ప్రజలకి నాయకులకు కార్యకర్తలకు వైఎస్ఆర్ సీపీ కొండేపి నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి వర్యులు డాక్టర్ ఆదిమూలపు సురేష్ బాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సేవలకు అవార్డు




గిద్దలూరు, మేజర్‌న్యూస్: మనదేశంలో భారత పౌరులందరి ఆరోగ్య స్థితిగతులను ఎలక్ట్రానిక్ ఎలక్ట్రానిక్ రూపంలో భద్రపరిచేందుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆరోగ్య సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న విషయం విధితమే. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సేవలో భాగమైన ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డు నిర్వహణలో జాతీయస్థాయిలో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. స్కాన్ అండ్ షేర్ నిర్వహణలో రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సేవలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రోత్సాహకరంగా జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఆస్పత్రులను డైరెక్టర్ నేషనల్ హెల్త్ మిషన్ వారు జిల్లాకి ఒక ప్రభుత్వ ఆసుపత్రి చొప్పున మరియు ఆ ఆసుపత్రిలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్స్ మిషన్ సేవలను నిర్వహించిన నోడల్ ఆఫీసర్లను ఎంపిక చేసి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు ఇవ్వడానికి నిర్ణయించారు. ప్రకాశం జిల్లా కు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రాంతీయ ఆసుపత్రికి గిద్దలూరు కు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సేవల నిర్వహణలో వరుసగా రెండో సంవత్సరం జిల్లాస్థాయి అత్యుత్తమ ఆసుపత్రిగా ఎంపిక చేసి ఈ సేవలను నిర్వహించిన ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబుకి కలెక్టర్ చేతుల మీదుగా ఒంగోలులో నిర్వహించు జిల్లా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో అవార్డును స్వీకరించడానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలువురు పుర ప్రముఖులు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబుకి అభినందనలు తెలియజేశారు.



## జాతీయ జెండాలు పంపిణీ

గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండలంలో దేశభక్తితో ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటి మీద జెండా ఎగరేయాలని భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ ఆదేశాలతోటి గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట తండాలో బుధవారం ఉదయం ఇంటింటికి వెళ్లి జండా అందజేయడం జరిగినది. అలాగే ఆగస్టు 15వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రతి ఇంటి మీద జెండా ఎగరేయాలని వారందరికి కూడా సూచనలు సలహాలు ఇచ్చినట్లు గిద్దలూరు తాలూకా బిజేపి కో కన్వీనర్ గుమ్మ రాముడు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విక్రం, దిగువమెట్ట చెంచు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## నగరం ఎస్ఐగా బండ్ల భార్గవ్



నగరం, మేజర్‌న్యూస్: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐగా బండ్ల భార్గవ్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పొన్నూరులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదలీపై నగరం వచ్చారు. భార్గవ్ మాట్లాడుతూ పోలీసులు ప్రజలు స్నేహపూర్వక వాతావరణాన్ని కలిగి ఉండాలని, అప్పుడే శాంతిభద్రతలకు మార్గం ఏర్పడుతుందన్నారు. తన పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేదని, అలాంటివారు తన దృష్టికివస్తే వారిపై చట్టపరమైన చర్యలు గైకొంటామన్నారు.

## ఉమ్మడివరం పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులుగా బూసి వెంకటేశ్వర్లు



త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: మండలంలోని గుట్టల ఉమ్మడివరం గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్య పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ మద్దతుతో బూసి వెంకటేశ్వర్లు పాఠశాల పేరెంట్స్ విద్యా కమిటీ చైర్మన్ బూసి వెంకటేశ్వర్లు గెలుపొందారు. ఉపాధ్యక్షురాలుగా నీలబోయిన అలివేలు గెలుపొందారు. ఇక్కడ ఎన్నికలు జరిగినప్పటికీ వైసీపీ మద్దతు దారులకు కమిటీ సభ్యులు మద్దతు పలికారు. దీంతో అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులకు వైసీపీ మద్దతుదారులు గెలుపొందటం చెప్పుకోలేని విశేషం.

## తహశీల్దార్ శ్రీనివాసరావును కలిసిన జనసేన నాయకులు



త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: నూతన తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జి.శ్రీనివాసరావును బుధవారము తన కార్యాలయంలో జనసేన పార్టీ నాయకులు కలసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. సందర్భంగా మండలంలోని గ్రామాలలో ఉన్నటువంటి రెవిన్యూ సంబంధించినటువంటి సమస్యలను ప్రభుత్వము చేపడుతున్నటువంటి గ్రామసభల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని వారు తాసిల్దారును కోరారు. స్పందించిన తహసిల్దార్ తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

## దీక్షా యువజన సేవా సంస్థ లోగో ఆవిష్కరణ



మార్కాపురం, మేజర్‌న్యూస్: సామాజిక సేవా, యువతను భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నూతనంగా స్థాపించిన దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ లోగోను సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, సాధన కళాశాల ప్రదనానచార్యులు కప్పగంతుల మధు సూదన్, బాలుర పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాహుల్ మీనా గతం నుంచి చేసిన పలు అవగాహన, స్వచ్ఛంధ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకొని దీక్ష సంస్థ అధ్యక్షులు శ్రీధర సాయి సుబ్బారావు ను అభినందించారు. మరిన్ని కార్యక్రమాలు చేయాలనీ వారు కూడా కార్యక్రమాల నిర్వహణ కొరకు సంప్రదించి యువత ఉత్తేజ పరిచి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా గతంలో జిల్లా స్థాయిలో ఎన్‌వైకే సంస్థ నుంచి ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు ఉత్తమ నేషనల్ యూత్ వాలంటీర్ అవార్డు ప్రకాశం జిల్లా తరపున తీసుకోవడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు: తహశీల్దార్





తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవరప్పాడు రెవెన్యూ పరిధిలో గ్రామంలోని సర్వే నెంబర్: 231/2-231/3లో ప్రభుత్వ భూమి కలదు. గంగవరం నుండి చీమకుర్తి వెళ్ళి ప్రధాన రహదారికి ఆనుకొని వాగు పోరంబోకు భూమి కలదు. కొంతమంది ఆక్రమించు కోవటం జరిగి ంది. సోమవరపాడు గ్రామ ప్రజలు స్థానిక తహశీ ల్దార్ పి.సింగారావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి గ్రామంలోని సర్వే నెంబర్ 231/2, 231/3 మండల సర్వేయర్ గ్రామ సర్వేలతో రెవెన్యూ సిబ్బందితో వచ్చి ఆక్రమించిన ప్రభుత్వ భూములను పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూమిలో ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని భూమిని స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆక్రమణదారులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులను స్థానికులను వారికి ఉన్న జన బలంతో ఆక్రమణదారులు బెదిరింపులకు దిగటం జరుగుతుంది. ఎంతో విలువైన ప్రభుత్వా భూమిని, ప్రజల రాకపోకల మార్గాన్ని ఆక్రమణల నుంచి కాపాడి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మరొకసారి గ్రామ ప్రజలు తాసిల్దార్‌కి విన్నవించారు.

## ముగిసిన సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ తరగతులు



వెలిగండ, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు మూడు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్పంచుల, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ రామచంద్ర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు, పంచా యతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పంచాయతీ కార్యద ర్శులు అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా తీర్చే విధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకోవాల నున్నారు. ఈ మూడు రోజుల శిక్షణ సమయంలో తెలుసుకున్న ప్రతి అంశాన్ని గ్రామాల అభివృద్ధికి ఉపయో గించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ రామచంద్రరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్ కుమార్, మండల పరిషత్ సిబ్బంది, మండల పర్యవేక్షణ అధికారి మహబూబ్ బాషా, సీనియర్ అసిస్టెంట్ షేక్ ఖాదర్ బాషా, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ పులిగడ్డ కోటేశ్వరరావు సేవలు మరువ రానివి



రేపల్లే, మేజర్‌న్యూస్: సిపిఐ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ఉద్యమమే ఊపిరిగా తీర ప్రాంత ప్రజా సమస్యలపై ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీ పట్ల నిరంతరం పోరాడిన వ్యక్తి కామ్రేడ్ పులిగడ్డ కోటేశ్వరరావు వేనని సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తన్నీరు సింగర కొండ అన్నారు. బుధవారం రేపల్లె నియోజకవర్గం లోని కూచినపూడి గ్రామంలో కామ్రేడ్ పులిగడ్డ కోటేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సింగర కొండ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, మేక రామ కోటేశ్వరరావు, కొరటాల సత్యనారాయణ తోపాటు అనేక భూ పోరాటాలు స్వతంత్ర ఉద్యమాల్లో అలుపెరగని పోరాటం చేసి పేద కుటుంబాలకు అండగా ఉంటూ పార్టీ సేవలకు తన జీవితం అంకితం చేసిన మహా నాయకుడని కోటేశ్వరావు సేవలను కొని ఆడారు. సిపిఐ పార్టీలో కోటేశ్వరావుకు తీర ప్రాంత ప్రజలు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల లో అండగా ఉంటూ పార్టీకీ అంకిత భావంతో పనిచేసిన కోటేశ్వరరావు సేవలు తీర ప్రాంత ప్రజలు మర్చిపోరని బాపట్ల జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి తన్నీరు సింగరకొండ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నంబూరు సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు దోమ రాజారెడ్డి, క్రంతేటి నాగయ్య, పులిగడ్డ కోటేశ్వరరావు కుమారుడు పులిగడ్డ సత్యనారాయణ, కుటుంబ సభ్యులు, సిపిఐ పార్టీ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా శివ పార్వతి



రేపల్లే, మేజర్‌న్యూస్: సాధారణ బదిలీల్లో భాగంగా రేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె శివపార్వతి బుధవారం బాధ్యతల స్వీకరించారు. కృష్ణాజిల్లా వీరులపాడు మండలం నుండి బదిలీపై రేపల్లె కు వచ్చారు. గతంలో ఎన్నికల సమయంలో కొంతకాలం ఎంపీడీవో గా శివపార్వతి రేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో బదిలీపై కృష్ణాజిల్లా వెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీడీవోను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపల్లె మండలంలో అన్ని గ్రామపంచాయతీలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాలకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఎం.పి.డి.ఓ.తెలిపారు.

## 1044 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని పొగాకు బోర్డు కేంద్రంలో బుధవారం జరిగిన పొగాకు వేలం కేంద్రంలో 1044 పొగాకు బేళ్లు కొనుగోలు అయినట్లు పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఎం.నిడమనూరు గ్రామం నుండి బుధవారం పొగాకు వేలం కేంద్రానికి 1152 పొగాకుబేళ్లును వేలంకు తీసుకుని రాగా అందులో 1044 పొగాకు బేళ్లు కొనుగోలు అయినట్లు తెలిపారు. అత్యధిక ధర కిలో రూ.358, కాగా అత్యల్ప ధర కిలో రూ.205 ధర పలికినట్లు వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

## నేడు మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



కంభం, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కంభం గ్రామ పంచాయతీ ప్రజలకు, మాంసాహారం విక్రయించే వ్యాపారస్తులకు ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ పండుగ సందర్భంగా చేపలు, చికెన్, పొట్టేళ్ళు మాంసం విక్రయించే వ్యాపారస్తులు కంభం గ్రామ పంచాయతీ పరిధిలో ఎటువంటి మాంసం విక్రయాలు జరపకూడదని, పంచాయతీ రాజ్ చట్టాలను ఉల్లంఘించి ఎవరైనా మాంసం విక్రయాలు చేస్తే కఠిన నిబంధనలు అమలు చేస్తామని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవరశెట్టి బ్రహ్మయ్య తెలిపారు. ప్రజలందరూ పంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు.

## మరణించిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సాయం



రేపల్లే, మేజర్‌న్యూస్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన నిజాంపట్నం మండలం బొర్రా వారిపాలెం గ్రామానికి చెందిన పలగాని గోపి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ భీమా ద్వారా రెండు లక్షల రూపాయలు గోపి కుటుంబసభ్యులకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖా మాత్యులు అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం టిడిపి మండల అధ్యక్షులు ఓగిబోయిన వెంకట్ యాదవ్ తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు

గిద్దలూరు, మేజర్‌న్యూస్: ప్రజాస్వామ్య పర్యవేక్షణలో భారత రాజ్యాంగం ప్రాముఖ్యత అనే అంశం మీద శనివారం వ్యాసరచన పోటీలు నిర్వర్తించడం జరిగింది. ఈ వ్యాసరచనలో గెలుపొందిన విజేతలను విడతల ఫౌండేషన్ వారు ప్రకటించడం అయినది.మొదటి బహుమతి బి.సుకన్య విశ్వ భారతి పాఠశాల, రెండో బహుమతి కే.యశ్వంత్ రెడ్డి యశ్వంస్వరెడ్డి గీతాంజలి పాఠశాల, మూడో బహు మతి కే.నిహారిక ఇంత వినూత్ని పాఠశాల, మూడో బహుమతి కే.దీపిక అనుష, ప్రభుత్వ పాఠశాలలో ఎం.ఖుషి, కే.షషబ్నా, మొదటి బహుమతి, రెండో బహుమతి, బాలికల ఉన్నత పాఠశాల గిద్దలూరు గెలు పొందడం జరిగింది. అలాగే జూనియర్ కళాశాలలో దీవెన సాహితీ కళాశాల, లక్ష్మి సాయి చైతన్య కళాశాల మొదటి బహుమతి, రెండో బహుమతి గెలుపొందడం జరిగినది. అలాగే కంటెస్టింగ్ కన్స్ లేషన్ బహుమ తులుగా ఎస్.కె. ఆసఫ్, సాయి టెక్నో స్కూల్ ఎస్.కె.సల్మ, అరుణోదయ స్కూల్ మానస లక్ష్మి, సూర్య విద్యానికేతన్ గెలు పొందడం జరిగినది. గెలు పొందిన విజేతలకు త్వరలో బహుమతి ప్రదానం జరుగుతుందని తెలియజేశారు.

## చాకిచర్ల బుక్ డిపాజిట్ సెంటర్ ఆకస్మిక తనిఖీ



ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని ఉలవ పాడు శాఖా గ్రంధాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న చాకిచర్ల బుక్ డిపాజిట్ సెంటర్‌ను ప్రకాశం జిల్లా గ్రం ధాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి బుధవారం ఆక స్మిక తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న అపర్ణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. బుక్ డిపాజిట్ సెంటర్ పనితీరు పై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉలవపాడు శాఖ గ్రంధపాలకుడు దాసరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు




సి.యస్.పురం, మేజర్‌న్యూస్: బ్రిటీషుదొరల పాలన నుండి దేశప్రజలకు విముక్తి కలిగించి కులమతవర్గాలకు అతీతంగా ఆనందంగా జరుపుకునే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మండలప్రజలకు అధికారులకు ప్రజాప్రతినిధులకు నాయకులకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మండల తెలు గుదేశం అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు (వెంగయ్య) ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి పాటుపడాలని మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషిచేయాలని అన్నారు.

## సత్యవతిపేటలో పారిశుద్ధ్య కార్యక్రమాలు



కర్లపాలెం, మేజర్‌న్యూస్. పారిశుద్ధ్య కార్యక్రమంలో బాగముగా కర్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యవతి పేటలో జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి ముందు ఉన్న మురికి గుంటలలో పంచాయతీ సిబ్బంది ,ఆరోగ్య కార్యకర్తలు ఏబెట్ స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీని వాసరావు,ఏ ఎన్ ఎం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీ స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ వేముల సుధాకర్



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన తర్లుపాడు బస్టాండ్ సెంటర్‌లో ఎస్ఐ వేముల సుధాకర్ వాహన తనిఖీ నిర్వహించారు వాహన ధృవపత్రాలు లేకపోయిన, నెంబర్ ప్లేట్ లేకపోయిన, లైసెన్స్ లేకపోయిన సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రామకృష్ణారెడ్డి, కానిస్టేబుల్ స్వర్జాన్ రాజ్, జనార్ధన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

- చుండూరు మండలంలో జరిగిన ఒక సంఘటన వీడియో సోషల్ మీడియా లో వైరల్ గా మారింది
- వీడియో కొందరు స్నేహితుల వ్యక్తిగత గొడవ అయినప్పటికి దానిని వక్రీకరించి కావాలనే కొందరు రాజకీయ రంగు పూస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు.
- వాస్తవాలు వక్రీకరించి రాజకీయాలకు ఆపాదించవద్దు
- ఇరువైపుల వారికి రాజకీయాలతో సంబంధం లేదు
- హత్యాయత్నానికి పాల్పడిన 7గురు నిందితులను గతంలోనే అరెస్ట్ చెయ్యడం జరిగింది
- ప్రస్తుతం వారు తెనాలి జైల్లో ఉన్నారు.
- వాస్తవాలు వక్రీకరించి అసంబద్ధ కథనాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాము: రేపల్లె డిఎస్పీ టి.మురళీకృష్ణ



రేపల్లే, మేజర్‌న్యూస్: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం చట్ట రీత్యా నేరం అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేపల్లె డిఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం, చినపరిమి గ్రామం నందు గల పొలాలలో యువకుని పై జరిగిన దాడి గురించి సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై రేపల్లె డిఎస్పీ వివరణ ఇచ్చినారు. డిఎస్పీ మాట్లాడుతూ చుండూరు మండలం చినపరిమి గ్రామంలోని ముస్లిం కులానికి చెందిన 17 సంవత్సరాల వయసు కలిగిన షేక్ అజ్గర్ కుట్టు మిషన్ నేర్చుకుంటూ ఒంగోలులో తన పెదనాన్న వద్ద ఉంటూ అప్పుడప్పుడు తన గ్రామానికి వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో చినపరిమి గ్రామానికి వచ్చి ది.31.07.2024 వ తేదీన మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద నుండి తన ఇంటికి వెళ్తుండగా, రాముల వారి గుడి వద్దకు వెళ్లేసరికి అజ్గర్ స్నేహితుడు సూర్య మరొక వ్యక్తి బండి పై వచ్చి సరదాగా అటు వెళ్లి వద్దాం అని బండి ఎక్కించుకున్నారు. మండూరు చర్చి డొంకలోనికి తీసుకువెళ్లి, అప్పటికే ముగ్గురు కుర్రవాళ్ళు మద్యం సేవిస్తూ ఉండగా, వారితో పాటుగా అజ్గర్ ను కూడా తాగమన్నారు. వారందరూ కలిసి మద్యం సేవిస్తుండగా, అక్కడకు బండిపై చిన్న, గాజులవరు గ్రామానికి చెందిన దయ, ఆలపాడు కు చెందిన చిన్ను లు వచ్చినారు. కాసేపు వారందరూ కలిసి మందు సేవించిన తర్వాత అజ్గర్‌ను అసభ్యకరంగా బూతులు తిడుతూ, అకారణంగా చేతులతో, కాళ్ళతో తన్నుతూ, వారి యొక్క ఫ్యాంట్ కు ఉన్న బెల్టులు తీసుకొని, అక్కడ దొరికిన కర్రలతో ఒకరి తర్వాత ఒకరు అసభ్యకరంగా బూతులు తిడుతూ, అతని చొక్కాను చించి, ముఖం పైన, వీపు పైన, పొట్ట పైన విచక్షణా రహితంగా కొట్టినారు. అతనిని కొట్టే సమయంలో వీడియోలు కూడా తీసినారు. అజ్గర్ స్పృహ కోల్పోయి పడిపోవడంతో అతడిపై దాడి చేసిన వ్యక్తులు తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళినారు. హస్పటల్ సిబ్బంది ఏం జరిగిందని అడగడంతో అజ్గర్ ను అక్కడ వదిలేసి వెళ్ళిపోయినారు. అజ్గర్ కు మెలకువ వచ్చి చూడగా, హస్పటల్ వద్ద నలిగిరి నాగరాజు అనే వ్యక్తి అజ్గర్ ను చూసి గుర్తుపట్టి ఏమైంది అని వివరణ అడిగి సదరు విషయాన్ని వారి బంధువులకు ఫోన్లో చెప్పినాడు. సదరు విషయంపై అజ్గర్ ఇచ్చిన స్టేట్మెంట్ పై చుండూరు పోలీస్ స్టేషన్ నందు దయ, చిన్న, గుడిపూడి సూర్యప్రకాష్ మరో 4 మంది పై ఆగస్టు ఒకటో తేదీన కేసు నమోదు చేయడమైనదని తెలిపారు ఈ కేసులో ముద్దాయిలు అయినటువంటి చుండూరు మండలం మండూరు గ్రామానికి చెందిన బత్తుల సునీల్ కుమార్, రెండో ముద్దాయిగా తెనాలి నందుల పేటకు చెందిన షేక్ ఇర్ఫాన్, మూడవ ముత్తయిగా తెనాలి ఐతానగర్ కు చెందిన పోసపాటి శివ సాయి ప్రకాష్ , నాలుగో ముద్దాయిగా అమర్తులూరు మండలం కూచిపూడి కి చెందిన కొక్కిలిగడ్డ ఆనంద కిషోర్, ది.6.08.2024 వ తేదీన అరెస్టు చేసి రిమాండ్ కు పంపించడమైనదని తెలిపారు. మరో ముగ్గురు చట్టంతో సంఘర్షణ పడుతున్న బాలురిని అదేరోజు అబ్జర్వేషన్ హెూమ్ కు తరలించడం జరిగింద న్నారు. ఈ సంఘటన వీడియో సోషల్ మీడియా లో వైరల్ గా మారాయి. ఆ వీడియో కొందరు స్నేహితుల వ్యక్తిగత గొడవ అయినప్పటికి దానికి కావాలనే కొం దరు రాజకీయ రంగు పులు ముతు దుష్ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఇటువంటి అసత్య ప్రచారాలు చేయడం చట్ట రీత్యా నేరం అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## విద్యతోపాటు క్రీడల్లోను రాణించాలి: వేజెండ్ల



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: సిఐటియు బాపట్ల వారి ఆధ్వర్యంలో భావితరాల విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు వేజెండ్ల శ్రీనివాసరావు రోటరీ క్లబ్ కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఉత్తేజపరుస్తూ వేజెండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్యారిస్ ఒలంపిక్స్ క్రీడల్లో భారతీయ క్రీడాకారులు కొన్ని విభాగాల్లో పథకాలు సాధించారని వారిని స్ఫూర్తిగా తీసుకొని మీరు కూడా భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించి మన దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా సిఐటియు కార్యదర్శి సిహెచ్ మహేందర్, ఓ లక్ష్మణరావు యుటిఎఫ్ నాయకులు, వినయ్, శ్రీనివాసరావు, సుబ్బారావు, ప్రసాదరావు మాస్టారు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల కేంద్రంలో న్యాయ సలహా సదస్సు



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం ఇందిరానగర్ లోని ప్రత్యేక అవసరాల కేంద్రంలో న్యాయ సలహా సదస్సు బుధవారం నిర్వహించారు.న్యాయ సలహా సభ్యులు ఎన్ శామ్యూల్ జాన్ ,పి.ప్రసాదరావులు కేంద్రంను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి ఐ ఆర్ టి ఉపాధ్యాయులు నరాలశెట్టి లక్ష్మీ ప్రసన్న ,సి హెచ్ చందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు తీర ప్రాంత గ్రామాలలో కూడా ఉన్నారని వారికి సేవలు అందించేందుకు ,వారు కేంద్రానికి వచ్చేందుకు వాహనం ను ఏర్పాటు చేస్తే ఇంకా కొంతమంది లబ్ది పొందుతారని న్యాయ సలహా సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పదవరోజుకు చేరిన శ్రావణమాస పూజలు



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: శ్రావణమాసం సందర్భంగా పదవ రోజు బుధవారం పారాయణ కార్యక్రమం గేదెల మల్లికార్జున-ధర్మపత్ని లక్ష్మీ భార్గవి దంపతుల గృహములో భక్తిశ్రద్ధలతో జరిగిందని శుక్రవారోత్సవ కమిటీ ప్రధాన నిర్వాహకురాలు బూర్లె అరుణకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలియుగంలో మానవులు అల్పప్రాణులన్నారు.యజ్ఞ యాగాలు, మొదలగు మోక్షమార్గానికి సాధనా లు కష్టము గనుక మోక్ష ద్వారా పురములు ఏడు ఉన్నాయన్న కాంచీపురం ఒకటి దక్షిణ భారతదేశంలో ఆ పురములోకి ప్రవేశించడమే చాలా గొప్ప విశేషమని మహనీయులు మహాత్ములు తెలియచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తూనుగుంట్ల కన్యాకుమారి,యెండూరి సూర్యప్రభ, మద్దుల నళిని,ఆత్మూరి లక్ష్మీ సునీత, కాళంగి హేమలత, మాటూరు స్వరూపారాణి తూనుగుంట్ల సుజాత,శ్రీవాణి, కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

## సీఐగా సోమశేఖర్ బాధ్యతలు



కొండేపి, మేజర్ న్యూస్: మండల పరిధి లోని కొండేపి సర్కిల్స్ ఇన్స్పెక్టర్‌గా జి.సో మశేఖర్ బుధవారం నాడు భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతు గతంలో చీరాల 2టౌన్ సిఐగా భాద్యతలు నిర్వహిస్తు సాధారణ బదిలీలో కొండేపికి రావడం జరిగింద న్నారు. సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడటం ప్రజలకు పోలీస్ అందుబాటులో ఉండి వారికి సేవలు అందించడం జరుగుతుందన్నారు. అంతకు ముందుగా కొండేపి మర్రిపూడి పొన్నలూరు యస్ఐలు కృష్ణ బాలాజీ, శివ, బసవరాజు రాజేష్ సిఐని కలిశారు.

## పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన



కర్లపాలెం,మేజర్‌న్యూస్: పంచాయతీ రాజ్ చట్టాలపై సర్పంచ్ లు ,కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి అన్నారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో 3 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, ఎంపీపీ యరం వనజ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ పి ఆర్ డి ఏలీషాబాబు, ఏ ఓ ఫైజుద్దీన్ ,శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాలతో విద్యార్థుల ర్యాలీ



ముండ్లమూరు,మేజర్‌న్యూస్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల వద్ద నుండి ఎంపీడీవో కార్యాలయాలు మీదుగా బస్టాండ్ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆర్ జనార్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదగాలని, బాగా చదివి తల్లిదండ్రులు ఉపా ధ్యాయులు గ్రామాలకు మంచి పేరు తీసుకొచ్చి ఉన్నత పదవులు ఆశించాలని కోరారు. 78వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించుకో వాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల కు ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 సుబ్బారావు ఎంఈఓ 2 వెంకటేశ్వర్లు ఈ ఓ ఆర్ డి శ్రీదేవి, బేతపూడి లింగారావు ఉపాధ్యాయులు ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది, వెలుగు సీసీలు విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన ప్రముఖ కాంట్రాక్టర్ తాత



పొదిలి, మేజర్‌న్యూస్: కర్నూల్ డిఐజి కోయా ప్రవీణ్ మర్యాద పూర్వకంగా బుధవారం పొదిలికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ తాత సత్య నారాయణ కలసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా సత్కరించారు.

## ఎంపీడీవో గా రామాంజనేయులు బాధ్యతలు స్వీకరణ



పంగులూరు, మేజర్‌న్యూస్: పంగులూరు మండలం ఎంపీడీవో గా బి రామాంజనేయులు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. రామాంజనేయులు ఎన్నికల ముందు ఇక్కడ ఎంపీడీవో గా పని చేశారు. ఎన్నికల సమయంలో బదిలీపై నెల్లూరు జిల్లాకు వెళ్లారు. ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా బుధవారం ఇక్కడకు ఎంపీడీవో గా వచ్చారు. ఎన్నికల సమయంలో ఇక్కడ ఎంపీడీవోకు పనిచేసిన మ్యాథ్యూ బాబు బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్లిన విషయం తెలిసిందే. ఇక్కడ ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన రామాంజనేయులు ఎంపీడీవో గా ఇక్కడికి రావడం మూడోసారి.

## సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ ఎలికావారిపల్లి గ్రామంలో శ్రీ సీతా రామ లక్ష్మణ హనుమత్ సమేత గణపతి నాభిశిల, శీతలాంబ శిఖరకలశ నూతన విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవం కార్యక్రమంలో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు దద్దాల నారాయణ యాదవ్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిస్వామి వారి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాస రెడ్డి,పంచాయతీ కన్వీనర్ ఏఎంసి డైరెక్టర్ కస్థాల బాలాజీ, వైసీపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, వణుకూరి రామిరెడ్డి, మారెళ్ల వెంకటేశ్వర రెడ్డి ఎస్సీ నాయకులు గురు ప్రసాద్, వంగ్రా గురవయ్య, ఎలికా తిరుపతయ్య, ఎలికా శ్రీనివాసులు, ఎలికా వెంకటేశ్వర్లు, నేలపనేని నాగేంద్ర బాబు, వంగ్రా వెంకట నారాయణ, నాగిరెడ్డి పల్లి సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రకోటపై తిరంగా 11 వసారి ఆవిష్కరించనున్న మోడీ

**అన్నం సతీష్ ప్రభాకర్**



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: భారతదేశం నేడు (ఆగస్టు 15) 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుం టున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక ఎర్రకోటపై నుంచి వరుసగా 11వ సారి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇంతకుముందు ఈ ఘనతను పండిట్ జవహర్లాల్ నెహ్రూ సాధించారు. నెహ్రూ దేశ మొదటి ప్రధాన మంత్రిగా వరుసగా 11 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలు చేశారని తెలిపారు బిజెపి నాయకుడు ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి భారత దేశాన్ని విముక్తం చేసిన అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ, మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరా జ్యం స్వతంత్ర భారతదేశంలో సహకారం కావాలని, జాతి కోసం ప్రాణాలు సైతం అర్పించిన వీరులను స్మరిస్తూ, స్వతంత్ర దినో త్సవం కేవలం నినాదాలకు మాత్రమే పరిమితం కాకుండా కార్యచరణలో ప్రతి ఒక్కరూ పాలుపంచు కోవాలని ఈ దేశ సౌభాగ్యం కోసం సరిహద్దుల్లో జవాన్, పొలంలో పంట పండించే రైతును ఎల్లప్పుడూ మర్చిపోవద్దంటూ, ఏ దేశమేగినా ఎందుకాలిడినా ఏ పీఠం ఎక్కిన ఎవ్వరేదురైనా పొగడరా నీ తల్లి భూమి భారతిని అనే స్ఫూర్తితో విదేశాల్లో సైతం రాణిస్తున్న ప్రతి భారతీయ పౌరుడు, స్వతంత్రం నా జన్మ హక్కు అని ఎలుగెత్తి చాటిన బాలగంగాధర్ తిలక్ ను స్మరిస్తూ, రత్నగర్భ అయినా భారత మాత ప్రపంచంలో అగ్రగణ్య దేశంగా ఎదగాలని, వీరుల త్యాగాల ఫలం ఆ మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఒక్కరం దేశ సౌభాగ్యం కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని నేడు జరుగు 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో అందరూ పాల్గొని ఘనంగా జరుపుకోవా లని పిలుపునిచ్చారు. అలాగే సతీష్ మెరైన్ ఫుడ్స్ కర్మాగారం నందు స్వతంత్ర దినోత్సవ వేడుకలు నేడు కార్మికులు ఉద్యోగులు తో కలసి జరుపుకుంటామని తెలిపారు.

# పొదిలిలో హర్ ఘర్ తిరంగా భారీ స్కూటర్ ర్యాలీ



పొదిలి, మేజర్‌న్యూస్: బెల్లంకొండ విద్యాసంస్థలు ప్రధాన క్యాంపస్ లో లిహర్ ఘర్ తిరంగాలి ఉత్సవాలలో భాగంగా బుధవారం కళాశాల నుంచి అధ్యాపకులు,విద్యార్థులు మోటార్ సైకిల్ తో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ నాయకులైన (స్వాతంత్ర సమరయోధులు) ఝాన్సీ లక్ష్మీబాయి, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, మహాత్మా గాంధీ,భారతమాత వేషధారణల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.దేశభక్తి నినాదాలు,దేశభక్తి గేయాలు ఆలపించారు. తదుపరి విద్యార్థులు దేశభక్తి పూరిత నినాదాలతో బిట్స్ ప్రధాన క్యాంపస్ నుండి కంబాలపాడులోని (ఒంగోలు - కర్నూలు జాతీయ రహదారిలో) జాతీయ రహదారిలో దేశ భక్తిని చాటుతూ నినాదాలు హోరెత్తిస్తూ...భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ విద్యా సంస్థల అధినేతలు బెల్లంకొండ విజయలక్ష్మి శ్రీనివాస్ ప్రసంగిస్తూ ప్రస్తుతం బంగ్లాదేశ్ లోభారత పౌరులకు రక్షణ లేకుండా పోయిందన్నారు.నాటి స్వాతంత్ర సమరయోధుల త్యాగ ఫలితాలే మా దేశానికి స్వేచ్ఛ, స్వతంత్రము వచ్చిందన్నారు. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రజలు జాతి సమైక్యతకు , దేశ సమగ్రత కట్టుబడి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం,దుష్ట శక్తుల్ని, సంఘ విచ్ఛిన్నకర శక్తులను నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ మద్దుల శ్రీనివాసులు ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ నారపుశెట్టి నాయుడు, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ తోట శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్, ఝాన్సీ ప్రియా నాయుడు, మహారాజు, నేలటూరి డిబ్బారెడ్డి, కుమారి హమీదా లక్ష్మీ కుమారి,గురివిశెట్టి భార్గవ నాయుడు, అబ్దుల్ల రఫీ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల్లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించాలి



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఉత్తర్వులు మేరకు గ్రామపంచాయతీలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించాలని ఎంపీడీవో ఆర్.జనార్ధన్ సర్పంచులకు, కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడవరోజు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో జనార్ధన్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పంచాయతీ నిధులు రూ. 10వేలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, పాఠశాలలోని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి, స్వీట్లు, చాక్లెట్లు పంచాలని తెలిపారు. అలాగే ప్రతి గ్రామపంచాయతీలో ఎల్‌ఈడి లైట్లు ఏర్పాటు చేసి గ్రామాల్లో వెలుగు నింపాలని, ఎల్‌ఈడి లైట్లు ఏర్పాటు చేయడం వల్ల పంచాయతీకి కరెంటు ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి శ్రీదేవి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాపిరెడ్డి పల్లెలో సీతారాముల కళ్యాణం



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని నందనవనం పంచాయతీలోని పాపిరెడ్డి పల్లి ఎస్సీ కాలనీలో వెలసిన సీతారాముల స్వామి వారి కళ్యాణ మహోత్సవం బుధవారం చీకటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కమిటీ తరపున ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో వెలసి ఉన్న స్వామి వారు మండలంలోని ప్రతి ఒక్కరు పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, మండల నాయకులు గాయం రామిరెడ్డి, పెంచికల రామకృష్ణ, కూరాకు బాల నారాయణ యాదవ్, మురహరి శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

## నై పుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ఈనెల 20 నుంచి ప్రారంభం



రేపల్లే, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20 తేదీ నుంచి స్థానిక ఏ.బీ.ఆర్ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. సి.రవి చంద్రకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్ నందు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ జూనియర్ పాస్వర్డ్ డెవలపర్స్ లకు ఉచిత శిక్షణ ఇవ్వబడునని తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం భారత ప్రభుత్వ సంస్థ అయిన జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్.ఎస్.డి.సి) వారిచే సర్టిఫికెట్ తో పాటు అర్హతను బట్టి వివిధ కంపెనీ ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. అభ్యర్థులు కనీసం 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు వరకు స్త్రీలు పురుషులు అర్హులని తెలిపారు. ఇంటర్ డిగ్రీ చదువుకొని పాస్ అయిన ఫెయిల్ అయిన దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు స్కిల్ డెవలప్మెంట్ రేపల్లె కోఆర్డినేటర్ సిహెచ్ రవికుమార్ ఫోన్ నెంబర్ 9347 46 8946 నెంబర్ ని సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

## దర్శి ఎంపీడీఓగా కుసుమ కుమారి బాధ్యతలు



దర్శి, మేజర్‌న్యూస్: దర్శి యంపిడిఓగా కె.కుసుమ కుమారి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె గతంలో ఇక్కడ యంపిడిఓగా పనిచేస్తూ సర్వత్రిక ఎన్నికలో భాగంగా అచ్చంపేటకు బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు పూర్వ స్థానమైన దర్శిలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమెను ఎం.ఈ.ఓలు రఘు రామయ్య, రమాదేవి, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

## సీఐ రామారావుని కలసిన టీడీపీ నాయకులు



దర్శి, మేజర్‌న్యూస్: దర్శి సర్కిల్ ఇన్స్పెక్టర్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన వై.రామారావు టిడిపి నాయకులు కలిశారు. సర్కిల్ కార్యాలయంలో టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. అనంతరం పూల మాల, శాలువాతో సన్మానించారు. సిఐని మద మంచి ఏడుకొండలు, మధు మంచి ప్రసాద్, ఉలవ సురేష్, ముప్పా రాజు సుబ్బయ్య, గోగినేని బ్రహ్మం చౌదరి మర్యాద పూర్వకంగా కలిశారు.

## పారిశుద్ధ్యంపై ముగిసిన శిక్షణా తరగతులు

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పారిశుధ్యంపై శిక్షణా తరగతుల కార్యక్రమంలో భాగంగా చివరిరోజు గిద్దలూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయటము జరిగినది. ఈ సమావేశంలో విస్తరణ అధికారి చెన్నరావు మాట్లాడుతూ యల్.యి.డి లైట్ల ఉపయోగాల గురించి అలాగే (లైట్ ఎమిట్టింగ్ డయోడ్) అంటే వెలుతురు పంపించే పరికరం. ఇది ఒక విధమైన సెమీకండక్టర్ పరికరం, ఇది విద్యుత్ ప్రవాహం ఇచ్చినప్పుడు కాంతిని వెలికితీయడంలో సహాయపడుతుంది. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు డి.విజయ, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ గుర్రం బాబు రావు, గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 12 ఏళ్ళపోరాటం ఫలితం ఎప్పుడో?

## రిటైర్డ్ ఆర్మీ జవాన్ కొమ్మాలపాటి హనుమంతరావు ఆవేదన

మద్దిపాడు, మేజర్‌న్యూస్: ఆర్మీ జవాన్ కొమ్మాలపాటి హనుమంతరావు జిల్లా కలెక్టర్‌కి అర్జీ సమర్పించారు. దేశాన్ని రక్షించే రిటైర్డ్ ఆర్మీ జవాన్ కొమ్మలపాటి హనుమంతరావుకే దిక్కు లేదు మరి సామాన్యుల గతి ఏమిటి అని ప్రజలు అంటున్నారు. మద్దిపాడు మండలం, అన్నంగి శివారు బూరేపల్లి గ్రామ నివాసి కొమ్మాలపాటి హనుమంతరావు తండ్రి సుబ్బారావు అనువారు ఆర్మీ జవాన్‌గా 12 సంవత్సరాలు సర్వీస్ చేసి తదుపరి రిటైర్డ్ అయ్యి 2012లో మద్దిపాడు మండలం, అన్నంగి గ్రామ సర్వే నెంబరు 456లో య 5.00 భూమి ని ఆర్మీ కోటా కింద మంజూరు చేయవల సిందిగా అప్పటి ప్రకాశం జిల్లా సైనిక బోర్డు అధికారి ద్వారా జిల్లా కలెక్టర్‌కి అర్జీ ద్వారా పంపియున్నారని, దానిపై కలెక్టర్ అప్పటి తాహసిల్దారుగా పనిచేయుచున్న జి.లక్ష్మణ నారాయణను సమగ్ర విచారణ చేసి నివేదిక పంపవలసిందిగా ఆదేశించారని, దానిపై విచారణ చేసిన జి.లక్ష్మీనారాయణ తాహసిల్దారు కలెక్టర్‌కి పంపిన ఆర్‌సిబి/140/2021 తేది 19/02/2022 నివేదికలో అన్నంగి గ్రామ సర్వే నెంబరు 456లో య 15.00 భూమి కలిగి ఉండి, దానిపై వ్యర్థపదార్థాలతో కప్పబడి ఉండి ఉన్నదని, ఆ వ్యర్థాలను తొలగించినచో కొమ్మాలపాటి హనుమంతరావుకు ఆర్మీ కోటా కింద య 5.00 ల భూమి అసైన్మెంట్ కింద పట్టా మంజూరు చేయుటకు అనుకూలముగా ఉన్నదని, తదుపరి ఆదేశముల నిమిత్తం పంపియున్నారని కొమ్మలపాటి హనుమంతరావు తెలిపారు. తదుపరి హనుమంతరావు ఈ విషయంపై ఎపిసిసిఎల్ఎ అధికారి వారికి ఫిర్యాదు చేయగా వారు మరలా తాహసిల్దార్ వారి సమగ్ర నివేదిక కొరకు తాహసిల్దారు వారికి పంపియున్నారని ఫిర్యాదారుడు తెలిపారు. దానిపై అప్పటి ఇన్చార్జి తహసిల్దార్ జ్వాలా నరసింహం గతములో జి.లక్ష్మణ నారాయణ తాసిల్దారు ఇచ్చిన నివేదిక ప్రకారం, వారు కూడా అదే నివేదిక ప్రకారం, తన నివేదిక సమర్పించి యున్నారని దానిపై కలెక్టర్ తాహసిల్దారు ఇచ్చిన నివేదిక ప్రకారం అన్నంగి గ్రామ సర్వేనెంబర్ 456లో య 5.00 భూమిని రానున్న అసైన్మెంట్ కమిటీలో పెట్టి ఫిర్యాది దారుడైన హనుమంత రావుకు ఆర్మీ కోటా క్రింద మంజూరు చేస్తామని, గౌరవ ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త వారికి కలెక్టర్ నివేదిక పంపి ఉన్నారని, ఫిర్యాదుదారునకు కోర్టు వారు చెప్పారని కొమ్మాలపాటి హనుమంత రావు తెలిపారు. కానీ అప్పటినుండి ఎలాంటి అసైన్మెంట్ సమావేశం జరగలేదని, తనకి భూమి మంజూరు చేయలేదని ఫిర్యాదు



దారుడు తెలిపి ఉన్నాడు. దీనిపై మరలా ఎపి ఇన్స్టిట్యూషన్ ఆఫ్ లోకాయుక్త కర్నూలు వారి నుండి, డిప్యూటీ రిజిస్టర్ ఆన్ బుల్ లోకాయుక్త ఆంధ్ర ప్రదేశ్ కార్యాలయం ఎల్ఆర్ డిఐఎస్ నెం 1083/2024/బి1/2995 తే 20/03/2024 లేఖ ద్వారా జిల్లా కలెక్టర్‌ని ఈ కేసు పై ఒక సమగ్ర నివేదిక కోరగా, దానిపై కలెక్టర్ ఒంగోలు ఆర్డీవో వారిని విచారణ చేయమని ఆదేశించారు. అన్నంగి గ్రామ సర్వేనెంబర్ 456 లో ఎలాంటి భూమి లేదని తప్పుడు నివేదిక ఇచ్చి ఉన్నారని సదరు ఫిర్యాదుదారుడైన కొమ్మాలపాటి హనుమంతరావు తే 12/08/2024 దిన కలెక్టర్ కార్యాలయము నందు గ్రీవెన్స్ సెల్, స్పందన కార్యక్రమములో అర్జీ రూపంలో కలెక్టర్‌కి ఇచ్చి ఉన్నారని దానిపై అర్జీ దారుడైన కొమ్మాలపాటి హనుమంతరావు తండ్రి సుబ్బారావు అనువారు మాకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి ఆర్మీ కోటా కింద అన్నంగి గ్రామ సర్వేనెంబర్ 456లో య 5.00 భూమికి అసైన్మెంట్ పట్టా మంజూరు చేయవలసిందిగా కోరుకొనుచు కలెక్టర్‌కి అర్జీ రూపంలో సమర్పించి ఉన్నానని మద్దిపాడు పత్రికల వారి వద్ద వాపోయాడు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాల్సిందే

### ఒంగోలు నగరంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్

### సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్స్ లేని, మాడిఫైడ్ సైలెన్సర్‌లు అమర్చిన పలు ద్విచక్ర వాహనాలు సీజ్

### నగరంలో పలు చోట్ల పర్యటించిన ఎస్పీ ఏఆర్ దామోదర్





ఒంగోలు, మేజర్‌న్యూస్ :ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలను పాటించాల్సిందేనని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. ఒంగోలు నగర పరిధిలో పలు ప్రధాన ఏరియాలతోపాటు ముఖ్య కూడళ్ల వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది బుధవారం ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్ జరుగుతున్న సమయంలో ఎస్పీ కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, చర్చి సెంటర్ ప్రాంతాల్లో స్వయంగా పర్యటించారు. ఎన్‌ఫోర్స్ మెంట్ తీరును ప్రత్యేక్షంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. 60 అడుగుల రోడ్డు వద్ద ప్రజలతో నేరుగా మాట్లాడి ట్రాఫిక్ సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఉల్లంఘనలు, ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన, స్వాతంత్య దినోత్సవ వేడుకల భద్రతా దృష్ట్యా ఒంగోలు పట్టణంలో సుమారు 350 మంది పోలీసు సిబ్బంది (ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, ముగ్గురు డిఎస్పీలు, 10 మంది సీఐలు, 30 మంది ఎస్సైలు మరియు సిబ్బంది)తో 2 షిప్టుల లో సరైన లైసెన్స్, రిజిస్ట్రేషన్, పత్రాలు లేనివి 300 ద్విచక్రవాహనాలను తనిఖీలు చేశారు. మాడిఫైడ్ సైలెన్సర్లు వాడుతున్న 150 బైక్స్ సీజ్ చేశామని తెలిపారు. ఇన్సూరెన్సు, నంబర్ ప్లేట్లు లేని ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్లు ఉన్న 100 బైకులు స్వాధీనంలో ఉన్నాయని వాటికి సరైన పత్రాలు చూపిస్తే రిలీజ్ చేస్తామని తెలిపారు. ఇలాంటి డ్రైవ్స్ తరచూ నిర్వహిస్తామని, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలు, ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్న మాడిఫైడ్ సైలెన్సర్‌లు ఉన్న ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. వాహన దారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ ఇతర ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, నెంబర్ ప్లేట్లు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఉండేలా చూచుకోవాల్సిన బాధ్యత వాహనదారులపైన ఉందన్నారు. భయంకరమైన సౌండ్స్ వచ్చే మాడిఫైడ్ సైలెన్సర్‌లు, సైరన్స్ అమర్చి ఇతర వాహనదారులు, మహిళలు, చిన్న పిల్లలకు భయాందోళనలు గురిచేస్తే చట్టపర మైన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో నగరంలోని ఆటోడ్రైవర్స్, ఆర్టీసీ, వాహనదారులు మరియు ప్రజలతో సమావేశం నిర్వహిస్తామని, నగరంలో ఎలాంటి అంతరా యం లేని ట్రాఫిక్ వాతావరణం కల్పించేలా ప్రణాళికబద్ధ చర్యలు తీసుకుంటామని, దానికి అందరూ సహకరించాలని కోరారు.ఎస్పీవెంట ఆడిషన్‌ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ వై.పాండు రంగారావు, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

## 139 బిసీ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బాలయ్య

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలులోని సంఘ భవనంలో 139 బీసీ కులాల జేఏసీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు గిద్దలూరుకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ జంగాల బాలయ్యని జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. బాలయ్య 139 బీసీ కులాల సమస్యలపై వారి అభివృద్ధి కొరకు పాటుపడాలని మిరియం శ్రీనివాసులు కోరారు.





## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

### భజాపా ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్

### బిజెపి యువ మోర్చా హర్ ఘర్ తిరంగా మోటర్ సైకిల్ ర్యాలీ



ఒంగోలు, మేజర్‌న్యూస్: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుందామని భారతీయ జనతా పార్టీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ అన్నారు. బిజెపి ఒంగోలు అసెంబ్లీ పరిధిలోని ఒంగోలులో బిజెపి యువ మోర్చా తలపెట్టిన హర్ ఘర్ తి రంగా మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కర్నూల్ రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జీ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు జరిగిన కొనసాగింది. ఈ సందర్భంగా యోగయ్య యాదవ్ మాట్లాడుతూ ఆగస్టు 15న 78వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నాం గానీ దేశ విభజకు ముందు రోజు 14 ఆగస్టు 1947 లో జరిగిన మత హింస, రక్తపాతం, మహిళలపై జరిగిన అకృత్యాలు. చరిత్ర ఉన్నంత వరకు మర్చిపోలేము అన్నారు. ఒక్కరోజే దాదాపు 5 నుండి 10 లక్షలమంది హిందువులు వూస కోతకు గురి కావటమే కాకుండా వాళ్ళ ఆస్తులు దోసుకోవటము జరిగిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజలలో దేశ సమైక్యత సమగ్రత, జాతీయ భావాలు పెంపొందాలని, ప్రతి ఇంటిమీద మువ్వన్నెల జెండా రెపరెప లాడాలని ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ మార్చా అధ్యక్షులు దామోదర్, బాపట్ల ఇన్చార్జి పి.వి కృష్ణారెడ్డి, ప్రకాశం జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, మండలాధ్యక్షులు గుర్రం రంగనాథ్, తిరుమలశెట్టి శ్రీరాములు, సంజీవ కుమార్ యాదవ్, రాయపాటి అజయ్, కావూరివాసు, సీతారామయ్య, తానికొండసురేష్ యాదవ్, కటారి సుధాకర్ యాదవ్, విజయ్ మోడీ, ధనిశెట్టి రాము, లక్ష్మణ్, మహిళా నాయకురాలు విజయరావు, సత్యవతి, శ్రీలక్ష్మి, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్ ప్రవర్తన కల్గి ఉండాలి



దర్శి, మేజర్‌న్యూస్: ఖైదీలు సత్ ప్రవర్తన కల్గి ఉండాలని జిల్లా న్యాయ సేవది కార సంస్థ కార్యదర్శి శ్యామ్ బాబు అన్నారు. దర్శి సబ్ జైల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సబ్ జైల్ సూపర్డెన్డెంట్ వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబ్ మొక్కలు నాటారు. దర్శి సబ్ జైల్‌లో ఖైదీలకు అందుతున్న న్యాయ సహాయం, భోజన సదుపాయంను, ఖైదీలను అడిగి అన్ని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి శ్యామ్ బాబు మాట్లాడుతు పచ్చదనం పరిశుభ్రత పరిరక్షణ కోసం మనమందరం పాటు పడాలి అని అన్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుదలగా ఉండాలి అంటే ప్రతిమనిషి భాద్యతగా వారి ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచాలి అన్నారు. సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరమణ మాట్లాడుతూ చెట్లు నరకడం వలన వర్షాలు సరిగా పడవు అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు పరిటాల సురేష్ మంజుల, మనోరమ్మా, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.